మీరే
చదువరి..
క్యూఆర్ కోడ్
స్కాన్ చేయండి..
ప్రపంచవ్యాప్త
వార్తలు చదవండి...

PRGI REGD NO: TGTEL/25/A1385

# నేటి ఈవార్తలు

NETI EVARTHALU దినపత్రిక

www.evarthalu.com

మీరే
విలేకరి..
క్యూఆర్ కోడ్
స్కాన్ చేయండి..
మీ ప్రాంతంలోని
వార్తలు పంపండి..

శుక్రవారం FRIDAY 5-6-2026 | జగిత్యాల JAGITIAL | పేజీలు: 12 PAGES:12 | వెల రూ.2.00 PRICE: 2.00 | సంపుటి: 1 Volume:1 | సంచిక: 337 Issue: 337

Circulated to Telangana
Published from Jagitial

05 జూన్ 2026 - శుక్రవారం శ్రీ పరాభవ నామ సంవత్సరం ఉత్తరాయణం - గ్రీష్మ ఋతువు జ్యేష్ఠ(అధిక) మాసం - కృష్ణపక్షం సూర్యోదయం - తె. 5:44 సూర్యాస్తమయం - సా. 6:44 తిథి పంచమి రా. 1:18ం వరకు తరువాత షష్ఠి సంస్కృత వారం భృగు వాసరః నక్షత్రం శ్రవణ తె. 5:54ం వరకు యోగం బ్రహ్మ ఉ. 9:32 వరకు కరణం కౌలవ మ. 12:26 వరకు తైతుల రా. 1:18ం వరకు వర్జ్యం ఉ. 8:05 నుండి ఉ. 9:50 వరకు దుర్ముహూర్తం ఉ. 8:20 నుండి ఉ. 9:12 వరకు మ. 12:40 నుండి మ. 1:32 వరకు రాహుకాలం ఉ. 10:37 నుండి మ. 12:14 వరకు యమగండం మ. 3:29 నుండి సా. 5:07 వరకు గుళికాకాలం ఉ. 7:22 నుండి ఉ. 8:59 వరకు బ్రహ్మముహూర్తం తె. 4:08 నుండి తె. 4:56 వరకు అమృత ఘడియలు సా. 6:37 నుండి రా. 8:23 వరకు అభిజిత్ ముహూర్తం ఉ. 11:48 నుండి మ. 12:40 వరకు గమనిక: "ం" అనగా మరుసటి రోజునపంచాంగం చందా



# మబ్బులు కమ్ముకుంటున్నాయ్!

## కేరళను తాకిన రుతుపవనాలు.. వారంలో తెలుగు రాష్ట్రాలకు రాక

మాడు పగిలే ఎండలు, వడగాల్పులు, ఉక్కుబోతతో ఉక్కిరిబిక్కిరి అవుతున్న ప్రజలకు భారత వాతావరణ విభాగం చల్లటి వార్త చెప్పింది. నైరుతి రుతుపవనాలు కేరళ తీరాన్ని తాకినట్టు ఐఎండీ గురువారం మధ్యాహ్నం ప్రకటించింది. కేరళ, తమిళనాడులోకి రుతుపవనాలు ప్రవేశించడంతో తీర ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయని తెలిపింది.

తిరువనంతపురం/హైదరాబాద్, జూన్ 4 (ఈవార్తలు): ఆంధ్రప్రదేశ్, తెలంగాణలోకి వారం రోజుల్లో ప్రవేశించను న్నాయి. అయితే, గతేడాదితో పోల్చితే ఈసారి 10 రోజులు ఆలస్యంగా భారత్‌లోకి రుతుపవనాలు ప్రవేశించాయి. వాస్త వానికి మే 26 నాటికే నైరుతి కేరళను తీరాన్ని తాకే అవకాశం ఉందని ఐఎండీ ముందు అంచనా వేసింది. కానీ, ప్రతికూల వాతావరణం, సూపర్ ఎల్‌నినో ప్రభావం తో ఆ అంచనాలు తరువాయి 2 వ పేజీలో...

# హైదరాబాద్‌కు ఎబోలా

### సూడాన్ నుంచి వచ్చిన వ్యక్తికి లక్షణాలు.. గాంధీ ఆస్పత్రికి తరలింపు




హైదరాబాద్‌లో ఎబోలా కలకలం రేగింది. శంషాబాద్ విమానాశ్రయంలో ఓ ప్రయాణికుడికి ఎబోలా వైరస్ హిస్టరీ ఉన్నట్లు అధికారులు గుర్తించారు. సూడాన్ దేశం నుంచి మహ్మద్ అనే వ్యక్తి గురువారం శంషాబాద్ ఎయిర్ పోర్టు చేరుకున్నారు. అయితే కేంద్ర ప్రభుత్వ సూచనల మేరకు విమానాశ్రయంలో అధికారులు ఆఫ్రికా దేశాల నుంచి వచ్చేవారికి స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తున్నారు.

హైదరాబాద్, జూన్ 4 (ఈవార్తలు):ఈ క్రమంలోనే సూడాన్ నుంచి వచ్చిన మహ్మద్‌కు పరీక్షలు నిర్వహించగా.. ఎబోలా వైరస్ హిస్టరీ ఉన్నట్లు గుర్తించారు. వెంటనే అప్రమత్తమైన వైద్య సిబ్బంది.. అతన్ని గాంధీ ఆస్పత్రికి తరలించారు. అక్కడ ఐసోలేషన్ కేంద్రంలో ఉంచి పరీక్షిస్తున్నారు. అతని నుంచి నమూనాలను సేకరించిన గాంధీ ఆస్పత్రి సిబ్బంది.. పరీక్షల్లో కోసం ఆ శాంపిళ్లను సీసీఎంబీకి పంపించారు. ఫలితాలు వచ్చేంత వరకూ ఈ విషయంపై ఆస్పత్రి వర్గాలలో టెన్షన్ నెలకొంది. మరోవైపు ఆఫ్రికా దేశాలైన కాంగో, ఉగాండాలలో ఎబోలా వ్యాప్తి తరువాయి 2 వ పేజీలో...



# రిజిస్ట్రేషన్ చార్జీలు పెంచం

## ప్రజలకు కార్పొరేట్ స్థాయి సేవలే లక్ష్యం

### రెవెన్యూలో సంస్కరణలకే ఇంటిగ్రేటెడ్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు

## మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వెల్లడి

### నేటి నుంచే అమల్లోకి భూముల పెంపు ధరలు

ప్రజలకు వేగవంతమైన, పారదర్శకమైన సేవలు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం రెవెన్యూ వ్యవస్థలో సమూల మార్పులకు శ్రీకారం చుట్టిందని రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. గచ్చిబౌలిలోని తాలిమ్ ప్రాంతంలో నిర్మిస్తున్న ఇంటిగ్రేటెడ్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ నిర్మాణ పనులను గురువారం పరిశీలించిన ఆయన అనంతరం మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో రిజిస్ట్రేషన్ చార్జీలు పెంచే ఆలోచన ప్రభుత్వానికి లేదని స్పష్టం చేశారు.

హైదరాబాద్, జూన్ 4:గత ప్రభుత్వం రిజిస్ట్రేషన్ ఫీజును 6 శాతం నుంచి 7.5 శాతానికి పెంచిందని గుర్తుచేశారు. ఒక్క శాతం పెంపు వల్ల కూడా ప్రజలపై వేల కోట్ల రూపాయల భారం పడుతుందనే ఉద్దేశంతో భూముల విలువలను శాస్త్రీయ పద్ధతిలో మాత్రమే సవరించామని చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ భూముల కనీస విలువను ఎకరానికి రూ.2.75 లక్షలుగా, మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో రూ.5 లక్షలుగా, హెచ్ఎండీఏ పరిధిలో రూ.10 లక్షలుగా, ఔటర్ రింగ్ రోడ్ పరిధిలో రూ.15 లక్షలుగా నిర్ణయించినట్లు వెల్లడించారు. సవరించిన విలువలపై ఎలాంటి అభ్యంతరాలు, సూచనలు ఉన్నా సమీక్షిస్తామని తెలిపారు. భూముల విలువలు, రిజిస్ట్రేషన్‌కు సంబంధించిన సందేహాలు, ఫిర్యాదుల కోసం టోల్‌ఫ్రీ నంబర్ 1800 599 4788, వాట్సాప్ నంబర్ 8247619983లను అందుబాటులో ఉంచినట్లు చెప్పారు. సబ్ రిజిస్ట్రార్ల అధికారాలను కుదించడం ద్వారా అక్రమాలకు తావు లేకుండా చర్యలు తీసుకున్నామని మంత్రి తెలిపారు. గత ప్రభుత్వంలో రెవెన్యూ శాఖలో అవినీతి, అక్రమాలకు తరువాయి 2 వ పేజీలో...




# తొలి ఫ్లెక్స్ ఫ్యూయెల్ కారు లాంచ్

## వ్యాగన్-ఆర్ మోడల్ మార్కెట్‌లోకి

### తయారుచేసిన మారుతి సుజుకి.. 85% ఇథనాల్ వినియోగమే

చమురు వినియోగం తగ్గించి.. ఇథనాల్ వినియోగం పెంచాలన్న భారత ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా.. తొలి ఫ్లెక్స్ ఫ్యూయెల్ కారు వచ్చేసింది. మారుతీ సుజుకీ.. భారత్‌లోనే మొట్టమొదటి ఫ్లెక్స్ ఫ్యూయెల్ మోడల్ వ్యాగన్- ఆర్‌ను పరిచయం చేసింది. జూన్ 4న దీనిని అధికారికంగా లాంచ్ చేశారు.

న్యూఢిల్లీ: జూన్ 5న ప్రపంచ పర్యావరణ దినోత్సవం నేపథ్యంలో హీరో మోటోకార్ప్ బుధవారం రెండు ఫ్లెక్స్ ఫ్యూయెల్ మోటార్ సైకిళ్లను లాంచ్ చేయగా, మారుతీ ఫ్లెక్స్ ఫ్యూయెల్ మోడల్ వ్యాగన్ ఆర్ కారును తీసుకొచ్చింది. కేంద్ర మంత్రులు నితిన్ గడ్కరీ, హర్‌దీప్ సింగ్ పురీ ఈ కారును గురువారం ఆవిష్కరించారు. ఈ ఫ్లెక్స్ ఫ్యూయెల్ కారు విషయానికి వస్తే ఇందులో 1.2 లీటర్ పెట్రోల్ ఇంజిన్ ఉంటుంది. సాధారణ పెట్రోల్‌త పాటు 85 శాతం వరకు ఇథనాల్ బ్లెండ్ చేసిన ఇ85 ఫ్యూయెల్‌తోనూ -2 వ పేజీలో...

## లాసెట్‌లో దేవ్‌జీకి 349 ర్యాంకు



కోరుట్ల, జూన్ 4 (ఈవార్త లు): తెలంగాణ లాసెట్ ఫలితా ల్లో మాజీ మావోయిస్టు అగ్రనేత దేవ్‌జీ అలియాస్ తిప్పిరి తిరుపతి 349వ ర్యాంకు -2 వ పేజీలో...



## బంగారం-వెండి ధరలు

బంగారం-వెండి ధరలు (హైదరాబాద్‌లో)

| | |
|---|---|
| (గ్రాము-24 క్యారెట్స్): | రూ.15,622 |
| వెండి (కిలో): | రూ.2,90,000 |
| ప్లాటినం (గ్రాము): | రూ.5,938 |



# ట్రంప్.. యుద్ధాన్ని ఆపేయ్!

### ప్రతినిధుల సభ తీర్మానం

### అమెరికా అధ్యక్షుడికి షాక్

ఇరాన్‌తో యుద్ధం విషయంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌నకు భారీ షాక్ తగిలింది. ఇరాన్ యుద్ధం నుంచి అమెరికా దళాలను ఉప-సంహరించుకోవాలనే తీర్మానానికి అమెరికా ప్రతినిధుల సభ ఆమోదం తెలిపింది. ఈ తీర్మానానికి అనుకూలంగా 215 మంది.. వ్యతిరేకంగా 208 మంది ఓట్లు వేశారు. అనవసర, భారీ ఖర్చుతో కూడిన ఈ సైనిక చర్యకు వెంటనే ముగింపు పలకాలని డిమాండ్ చేశారు.

వాషింగ్టన్: విదేశీ వ్యవహారాల కమిటీలో సభ్యుడు న్యూయార్క్ డెమొక్రాట్ ప్రతినిధి గ్రెగొరీ మీక్స్ ప్రవేశపెట్టిన ఈ తీర్మానంపై సభలో నిర్వహించిన ఓటింగ్‌లో నలుగురు రిపబ్లికన్‌లు అనుకూలంగా ఓటువేయడం గమనార్హం. ట్రంప్ చర్యలను సొంత పార్టీ సభ్యులు వ్యతిరేకించడం చర్చనీయాంశంగా మారింది. రిపబ్లికన్‌లకు మెజార్టీ ఉన్న ప్రతినిధుల సభలో తొలిసారి ట్రంప్‌కు వ్యతిరేకంగా తీసుకొచ్చిన తీర్మానం ఆమోదం పొందడం తరువాయి 2 వ పేజీలో...

# పర్మిషన్ మీ ఇష్టం.. ధర్నా మాత్రం ఆగదు!

### రేపు జంతర్ మంతర్ వద్ద నిరసన

### కాక్రోచ్ జనతా పార్టీ హెచ్చరిక

### ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాకు డిమాండ్




ఆన్‌లైన్‌లో వ్యంగ్య వేదికగా ప్రారంభమైన 'కాక్రోచ్ జనతా పార్టీ' (సీజేపీ) ఇప్పుడు ప్రత్యక్ష పోరాటానికి సిద్ధమైంది. దేశవ్యాప్తంగా పరీక్షల నిర్వహణలో జరుగుతున్న అవకతవకలకు నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని ఈ పార్టీ డిమాండ్ చేస్తోంది.

న్యూఢిల్లీ: ఇందులో భాగంగా శనివారం (జూన్ 6) ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద భారీ నిరసన ప్రదర్శన చేపట్టనున్నట్లు ప్రకటించింది. పోలీసుల అనుమతి లభించినా, లభించకపోయి నా శాంతియుత పద్ధతిలో తమ నిరసనను కొన సాగిస్తామని పార్టీ ప్రతినిధులు స్పష్టం చేశారు. నిరుద్యోగ యువతపై సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో సామాజిక మాధ్యమాల్లో ఈ ఉద్యమం పురుడుపోసుకుంది. ముఖ్యంగా నీట్-యూజీ 2026 పేపర్ లీకేజీ వంటి వరుస కుంభకోణాల వల్ల తరువాయి 2 వ పేజీలో...

# ఓపీ వైద్య సేవలు బంద్

### జీవో 38ని అమలు చేయాల్సిందే

### సర్కారుకు ప్రభుత్వ వైద్యుల హెచ్చరిక

బదిలీల్లో వైద్యుల న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర వ్యాప్తంగా శుక్రవారం నుంచి వైద్య సేవలు నిలిపి వేస్తున్నట్లు తెలంగాణ ప్రభుత్వ వైద్యుల సంఘం (టీజీజీడీఏ) పేర్కొంది.

హైదరాబాద్, జూన్ 4 (ఈవార్తలు): జీవో నెం.38 నిబంధనలను పూర్తిగా అమలు చేసే వరకు టీజీజీడీఏ రాష్ట్ర కార్యవర్గ పదాధికారులు ఎవరూ బదిలీలకు సంబంధించిన ఆప్షన్ ఫారాలను సమర్పించబోరని స్పష్టం చేసింది. తెలంగాణ ప్రభుత్వ వైద్యుల సంఘం గురువారం అత్యవసర సమావేశం నిర్వహించి, ప్రస్తుతం రాష్ట్రంలో జరుగుతున్న వైద్యుల బదిలీలు ప్రభుత్వం జారీ చేసిన తరువాయి 2 వ పేజీలో...

## విశ్వవాణి



న్యూయార్క్ క్రమంగా భూమిలోకి కుంగిపోతోంది. ప్రతి సంవత్సరం సుమారు 1 నుంచి 2 మిల్లీమీటర్ల మేర కుంగుతోంది. నగరంలోని దాదాపు పది లక్షల భవనాల భారీ బరువు సుమారు 70 వేల కోట్ల కిలోలు. ఈ బరువును మోయలేక భూగర్భంలోని మట్టి ఒత్తిడికి గురై వల్ల ఈ పరిస్థితి ఏర్పడుతోంది. దీనికి తోడు సముద్ర మట్టం పెరుగుతుండటం కూడా సమస్యను మరింత తీవ్రం చేస్తోంది.



# 700 తిమింగళాలు, డాల్ఫిన్‌ల ఊచకోత

కోపెన్‌హెగెన్: నార్త్ అట్లాంటిక్ సముద్రంలోని ఫారో దీవుల్లో రక్తం ఏరులై పారింది. సంప్రదాయం పేరుతో జలచరాలను ఊచకోత కోశారు. 'గ్రైండాడ్రాప్' ఉత్సవంలో భాగంగా ఏకంగా ఒక్క రోజులో 700కు పైగా తిమింగలాలు, డాల్ఫిన్లను ముక్కలు చేశారు. దాంతో సముద్ర తీరం ఎర్రగా మారిపోయింది. మే 27న జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ప్రపంచ సముద్ర పర్యావరణ సంస్థ 'సీ షెఫర్డ్' ప్రకారం.. టోర్షావన్‌లో సాండెగెర్డి బే వద్ద వేటగాళ్లు 402 పైలట్ తిమింగలాలను, నాలుగు బాటిల్‌నోస్ డాల్ఫిన్‌లను ఒడ్డుకు తీసుకొచ్చి.. -2 వ పేజీలో...



# 24 గంటల్లో విదేశీయుల వివరాలివ్వాలి

## హైదరాబాద్ పోలీసుల తాజా అడ్వైజరీ

### నిబంధనలు పాటించని యజమానులు, విద్యాసంస్థలపై చర్యలు

హైదరాబాద్, జూన్ 4 (ఈవార్తలు): హైదరాబాద్‌లో బస చేసే విదేశీయుల వివరాలను 24 గంటల్లోగా తమకు తెలియజేయాలని నగర పోలీసులు స్పష్టం చేశారు. ఈ మేరకు ఇమ్మిగ్రేషన్ అండ్ ఫారినర్స్ యాక్ట్, 2025 ప్రకారం యజమానులకు, విద్యాసంస్థలకు తాజా అడ్వైజరీ జారీ చేశారు. నిబంధనలు పాటించని పక్షంలో కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. గోల్కొండ జోన్ డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ (డీసీపీ) జూన్ 3న ఈ తరువాయి 2 వ పేజీలో...

# రాశి ఫలాలు



5.6.2026

మేషం: సన్నిహితులతో స్వల్ప వివాదాలు కలుగుతాయి. కుటుంబ వ్యవహారాలలో జాగ్రత్త అవసరం. ఆకస్మిక ప్రయాణ సూచనలు ఉన్నవి. దైవచింతన పెరుగుతుంది. వ్యాపారాలలో స్వల్ప లాభాలను అందుకుంటారు. వృత్తి ఉద్యోగాలలో కొంత అనుకూల వాతావరణం ఉంటుంది. వృధా ఖర్చులు పెరుగుతాయి.

వృషభం: ముఖ్యమైన వ్యవహారాలలో ఆప్తుల సలహాలు తీసుకుని ముందుకు సాగడం మంచిది. అనుకున్న పనులు అనుకున్న సమయానికి పూర్తి చేస్తారు. వృత్తి ఉద్యోగాలలో మీ ప్రతిభకు తగిన గుర్తింపు లభిస్తుంది. విలువైన వస్తువులు కొనుగోలు చేస్తారు. వ్యాపారాలలో అంచనాలను అందుకుంటారు.

మిథునం: చేపట్టిన పనులు కొంత నెమ్మదిగా సాగుతాయి. వృధా ఖర్చులు పెరుగుతాయి. స్థిరాస్తి వివాదాలు చికాకు పరుస్తాయి. స్వల్ప అనారోగ్య సమస్యలు బాధిస్తాయి. వృత్తి వ్యాపారాలలో గందరగోళ పరిస్థితులు ఉంటాయి. ఉద్యోగమున అధికారులతో చర్చలు ఫలించవు. ఆకస్మిక ప్రయాణ సూచనలు ఉన్నవి.

కర్కాటకం: సమాజంలో పేరు కలిగిన వ్యక్తులతో పరిచయాలు కలుగుతాయి. దైవ సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు. పాతబాకీలు వసూలవుతాయి. ఉద్యోగమున అప్పగించిన బాధ్యతలు సమర్థవంతంగా నిర్వహిస్తారు. వ్యాపారమున మరింత మెరుగైన పరిస్థితులు ఉంటాయి.

సింహం: దూరప్రయాణాలు వాయిదా వేయుట మంచిది. ఇంటాబయటా కొన్ని సమస్యలు ఇబ్బంది కలిగిస్తాయి. ధన పరంగా చికాకులు తప్పవు. ఆరోగ్య విషయంలో కొంత శ్రద్ధ వహించాలి. పుణ్యక్షేత్రాలు సందర్శిస్తారు. వృత్తి వ్యాపారాలలో శుభవార్తలు అందుతాయి. ఉద్యోగస్తులు అధికారుల ఆగ్రహానికి గురి కావాల్సి వస్తుంది.

కన్య: దీర్ఘకాలిక వివాదాల నుంచి బయటపడతారు. ఆదాయం సంతృప్తికరంగా ఉంటుంది. నిరుద్యోగులు నూతన ఉద్యోగ అవకాశాలు పొందుతారు. మిత్రులతో దైవదర్శనం చేసుకుంటారు. వ్యాపారమున ప్రత్యర్థులు కూడా మిత్రులుగా మారతారు. నూతన వాహన యోగం ఉన్నది. విలువైన గృహోపకరణాలు కొనుగోలు చేస్తారు.

తుల: దీర్ఘకాలిక ఋణబాధలు తొలగుతాయి. చిన్ననాటి మిత్రుల ఆగమనం ఆనందం కలిగిస్తుంది. నిరుద్యోగ ప్రయత్నాలు కలసివస్తాయి. కుటుంబ సభ్యులతో దైవ దర్శనాలు చేసుకుంటారు. వృత్తి వ్యాపారాలు ప్రోత్సాహకరంగా సాగుతాయి. ఉద్యోగస్తులకు జీతభత్యాల విషయంలో శుభవార్తలు అందుతాయి.

వృశ్చికం: చేపట్టిన పనులు మందగిస్తాయి. కొన్ని వ్యవహారాలు శ్రమతో గాని పూర్తి కావు. దూరప్రయాణాలలో వాహన ఇబ్బందులు ఉంటాయి. కుటుంబ సభ్యులతో స్వల్ప వివాదాలు తప్పవు. వ్యాపారాలు కొంత నిరుత్సాహ పరుస్తాయి. ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు. అవసరానికి చేతిలో డబ్బు నిల్వ ఉండదు.

ధనస్సు: వృధా ఖర్చులు పెరుగుతాయి. కుటుంబసభ్యుల నుంచి ఋణ ఒత్తిడి పెరుగుతుంది. అనారోగ్య సమస్యలు బాధిస్తాయి. చేపట్టిన పనులలో శ్రమకు ఫలితం కనిపించదు. సోదరులతో ఆస్తి వివాదాలు ఉంటాయి. ప్రయాణాలు వాయిదా వేస్తారు. వ్యాపార, ఉద్యోగాలలో గందరగోళ పరిస్థితులు ఉంటాయి.

మకరం: సమాజంలో పెద్దలతో పరిచయాలు విస్తృతమవుతాయి. గృహ నిర్మాణ విషయంలో ఆలోచనలు కార్యరూపం దాలుస్తాయి. చిన్ననాటి మిత్రులను కలుసుకొని పాత విషయాలు చర్చిస్తారు. విద్యార్థులకు నూతన అవకాశాలు లభిస్తాయి. వ్యాపార, ఉద్యోగాలు మరింత ఉత్సాహంగా సాగుతాయి.

కుంభం: దూరపు బంధువుల నుండి శుభవార్తలు అందుతాయి. ప్రముఖులతో పరిచయాలు పెరుగుతాయి. ఇంటా బయట మీ మాటకు విలువ పెరుగుతుంది. వృత్తి వ్యాపారాలలో చిత్రమైన సంఘటనలు చోటుచేసుకుంటాయి. వృత్తి ఉద్యోగాలలో ఇబ్బందులను అధిగమిస్తారు. గృహోపకరణాలు కొనుగోలు చేస్తారు.

మీనం: చేపట్టిన పనులలో శ్రమకు ఫలితం కనిపించదు. ఆస్తి తగాదాలు మరింత చికాకు కలిగిస్తాయి. ముఖ్యమైన వ్యవహారాలలో ఆలోచనలు స్థిరంగా ఉండవు. బంధువులతో మాట పట్టింపులు ఉంటాయి. దూర ప్రయాణాలు వాయిదా వేయుట మంచిది. నిరుద్యోగ ప్రయత్నాలు నత్తనడకన సాగుతాయి. దైవ చింతన పెరుగుతుంది.

# మబ్బులు కమ్ముకుంటున్నాయ్!

మొదటి పేజీ తరువాయి

తారుమారయ్యాయి. అటు, రుతుపవనాల రాకతో కేరళ భారీ వర్షాలు కురుస్తున్నాయి. అలప్పుజ, కొట్టాయం, ఎర్నాకుళం జిల్లాలకు ఐఎండీ ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. అలాగే, తమిళనాడులోని పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ఐఎండీ హెచ్చరించింది. "నైరుతి రుతుపవనాలు ఈ రోజు జూన్ 4, 2026న నైరుతి, ఆగ్నేయ అరేబియా సముద్రంలోని మిగిలిన ప్రాంతాలు, పశ్చిమ మధ్య, తూర్పు మధ్య అరేబియా సముద్రంలోని కొన్ని భాగాలు, లక్షద్వీప్ దీవులు, కేరళ, కర్ణాటక, తమిళనాడులలోని కొన్ని ప్రాంతాలు, కొమరిన్‌లోని మిగిలిన భాగాలు, ఆగ్నేయ బంగాళాఖాతం, నైరుతి, పశ్చిమ మధ్య, తూర్పు మధ్య, ఈశాన్య బంగాళాఖాతంలోని మరికొన్ని చోట్లకు విస్తరించాయి" అని పేర్కొంది. ఈ ఏడాది దేశవ్యాప్తంగా రుతుపవన వర్షపాతం సాధారణం కంటే తక్కువగా ఉంటుందని వాతావరణ శాఖ తన అంచనాను సవరించిన సంగతి తెలిసిందే. ఈ ఏడాది భారత్‌లో వర్షపాతం దీర్ఘకాల సగటులో సుమారు 90% ఉంటుందని భారత వాతావరణ శాఖ అంచనా వేస్తోంది. ఎల్పీఏ అంటే ఒక నిర్దిష్ట ప్రాంతంలో, ఒక నెల లేదా సీజన్‌లో నమోదైన వర్షపాతాన్ని, సాధారణంగా 30 నుంచి 50 సంవత్సరాల సుదీర్ఘ కాలానికి సగటున లెక్కిస్తారు. 1971 నుంచి 2020 వరకు ఉన్న వర్షపాత గణాంకాల ఆధారంగా దేశంలో నైరుతి సీజన్‌లో సగటు ఎల్పీఏ 87 సెం.మీ.గా ఉంది. రుతుపవన కాలంలో 90% కంటే తక్కువ వర్షపాతం నమోదైతే దానిని 'లోటు'గా వర్గీకరిస్తుంది. వర్షపాతంపై ఎల్‌నినో తీవ్ర ప్రభావం చూపుతుందని ఐఎండీ తెలిపింది. పసిఫిక్ మహాసముద్ర ప్రాంతంలో ఎల్‌నినో పరిస్థితులు ఆవిర్భవిస్తున్నాయని, జూన్‌లో ఇవి బలహీనంగా ఉన్నా సెప్టెంబరులో మాత్రం బలంగా ఉండే అవకాశం ఉందని వివరించింది.

# రిజిస్ట్రేషన్ చార్జీలు పెంచం

మొదటి పేజీ తరువాయి

పాల్పడిన వారిపై చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. తాను బాధ్యతలు చేపట్టిన తర్వాత దాదాపు 3,500 ఫైళ్లను పరిష్కరించినట్లు పేర్కొన్నారు. తప్పు చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకున్నామని చెప్పారు. అలాగే గతంలో రిజిస్ట్రేషన్ జరిగిన అసైన్డ్ భూములను నిషేధిత జాబితాలో చేర్చినట్లు తెలిపారు. భూములకు సంబంధించిన అన్ని రికార్డులను డిజిటలైజేషన్ చేయనున్నట్లు వెల్లడించారు.

13 క్లస్టర్లలో ఆధునిక భవనాలు

స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్స్ శాఖలో విప్లవాత్మక సంస్కరణలకు శ్రీకారం చుట్టామని పేర్కొన్నారు. మొదటి దశలో ఔటర్ రింగ్ రోడ్ పరిధిలోని 39 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను 13 క్లస్టర్లుగా విభజించి ఇంటిగ్రేటెడ్ భవనాలుగా అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వంపై ఆర్థిక భారం లేకుండా ప్రైవేట్ సంస్థలతో ఈ నిర్మాణాలు చేపడుతున్నట్లు చెప్పారు. మూడు నుంచి ఐదు ఎకరాల విస్తీర్ణంలో నిర్మించే ఈ భవనాల్లో మినీ మ్యారేజ్ హాల్, గర్భిణులు, వృద్ధుల కోసం ప్రత్యేక సౌకర్యాలు, విశాలమైన వెయిటింగ్ హాల్స్, మహిళల కోసం ఫీడింగ్ రూమ్, చిన్నారుల కోసం క్రెచ్, దివ్యాంగులు, వృద్ధుల కోసం లిఫ్ట్ సదుపాయాలు ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. ఇప్పటికే నాలుగు ఇంటిగ్రేటెడ్ భవనాలకు శంకుస్థాపన చేసినట్లు, గచ్చిబౌలి భవనాన్ని డిసెంబర్ నాటికి అందుబాటులోకి తీసుకురానున్నట్లు చెప్పారు. త్వరలో కోహెడలో మరో భవనానికి శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు. రెండో దశలో జిల్లా కేంద్రాల్లో కూడా ఇలాంటి ఆధునిక భవనాలు నిర్మించనున్నట్లు వెల్లడించారు.

ఫ్యూచర్ సిటీ రద్దు అసాధ్యం

ఫ్యూచర్ సిటీ ప్రాజెక్టును రద్దు చేయడం సాధ్యం కాదని పొంగులేటి స్పష్టం చేశారు. ఫ్యూచర్ సిటీలో భూములు ఉచితంగా



ఇవ్వలేదని, ప్రాజెక్టును రద్దు చేస్తే ప్రభుత్వం భారీగా నష్టపరిహారం చెల్లించాల్సి వస్తుందని పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇండ్ల తొలి దశ విజయవంతమైందని మంత్రి తెలిపారు. నిరుపేదల సొంతింటి కలను నెరవేర్చే అవకాశం దక్కడం తనకు సంతృప్తినిచ్చిందన్నారు. ప్రారంభంలో ఒత్తిళ్లు ఎదురైనా వెనక్కి తగ్గలేదని, ప్రస్తుతం ఆ నిర్ణయాల ఫలితాలు కనిపిస్తున్నాయని పేర్కొన్నారు.



# ట్రంప్.. యుద్ధాన్ని ఆపేయ్!

మొదటి పేజీ తరువాయి

గమనార్హం. కాంగ్రెస్ అధికారికంగా యుద్ధం ప్రకటించడం లేదా సైనిక చర్యలకు ఆమోదం తెలిపితే తప్పా ఇరాన్‌పై అమెరికా సైన్యాలు ఎలాంటి దుందుడుకు చర్యలకు పాల్పడకూడదని ట్రంప్‌ను ఈ తీర్మానం ఆదేశిస్తుంది. ప్రతినిధుల సభ 'యుద్ధ అధికారాల తీర్మానాన్ని' ఆమోదించడం డొనాల్డ్ ట్రంప్‌కి భారీ ఎదురు దెబ్బ. కానీ, గత మూడు నెలలుగా ఇరాన్‌తో కొనసాగుతోన్న సంఘర్షణను ఇప్పటికిప్పుడే ముగిస్తుందని చెప్పలేం. ఈ తీర్మానం ఆమోదంతో ఇరాన్‌పై ట్రంప్ చర్యలను అమెరికన్లు వ్యతిరేకిస్తున్నారనే విషయం మరోసారి స్పష్టమవుతుంది. ఇలాంటి తీర్మానమే మే నెలాఖరులో సెనెట్‌లో ఒక కీలకమైన ప్రక్రియ దశను దాటింది. రిపబ్లికన్ల స్వల్ప నియంత్రణలో ఉన్న ఎగువ సభలో కూడా ఈ వారంలోనే ఇది ఆమోదం పొందొచ్చు. అయితే, రిపబ్లికన్‌లు ఆమోదాన్ని అడ్డుకోవడానికి ప్రయత్నించవచ్చు. ఇక, ఈ తీర్మానం సెనెట్‌కు వెళ్లాక.. అక్కడ ఆమోదం పొందితే చివరకు అధ్యక్షుడు ట్రంప్ వద్దకు చేరుతుంది. దీనిని ఆయన వీటో చేయవచ్చు. కాంగ్రెస్ అనుమతి లేకుండా ఫిబ్రవరి చివరిలో ఇజ్రాయెల్‌తో కలిసి ఇరాన్‌పై దాడులు ప్రారంభించి రాజ్యాంగాన్ని ట్రంప్ ఉల్లంఘించారని డెమొక్రాట్లు ఆరోపిస్తున్నారు. యుద్ధ అధికారాల చట్టం ప్రకారం, అమెరికా బలగాలను యుద్ధంలోకి దింపిన తర్వాత అధ్యక్షులకు కాంగ్రెస్ ఆమోదం పొందడానికి 60 రోజుల సమయం ఉంటుంది. ఆ గడువు కొద్ది వారాల కిందటో ముగిసిందని, ఇప్పుడు ట్రంప్ చట్టాన్ని ఉల్లంఘిస్తున్నారని డెమొక్రాట్లు అంటున్నారు. ఏప్రిల్‌లో జరిగిన కాల్పుల విరమణ ఒప్పందంతో ఆ గడువు నిలిచిపోయిందని వాదిస్తూ వైట్ హౌస్ ఈ ఆరోపణలను ఖండిస్తోంది. ఇదిలా ఉండగా, అమెరికా మధ్యవర్తిత్వంతో జరిగిన నాలుగో విడత చర్చల్లో కాల్పుల విరమణ ఒప్పందాన్ని పునరుద్ధరించేందుకు ఇజ్రాయెల్- లెబనాన్‌లు అంగీకరించాయి. వివాదాలను పూర్తిగా పరిష్కరించడానికి మరిన్ని ప్రత్యక్ష చర్చలు జరిపేందుకు ఇరుదేశాలు ఒప్పుకున్నాయి. ఇరాన్‌కు మద్దతిస్తున్న హెజ్బొల్లా పూర్తిగా కాల్పులను నిలిపివేయాలని, దక్షిణ లిటాని సెక్టార్ నుంచి సైన్యాలను ఉపసంహరించుకోవాలనే షరతులు కూడా ఉన్నాయి.




# హైదరాబాద్‌కు ఎబోలా

మొదటి పేజీ తరువాయి

ఎక్కువగా ఉంది. ముఖ్యంగా బుండిబుగ్యో అనే వేరియంట్ కారణంగా ఎక్కువ సంఖ్యలో కేసులు నమోదవుతున్నాయి. దీంతో ప్రపంచ ఆరోగ్య సంస్థ కూడా అప్రమత్తమై.. ఇంటర్నేషనల్ హెల్త్ ఎమర్జెన్సీ ప్రకటించిన సంగతి తెలిసిందే. ఆఫ్రికా దేశాలలో ఎబోలా వైరస్ వ్యాప్తి నేపథ్యంలో కేంద్రం కూడా అప్రమత్తమై పలు సూచనలు చేసింది. ఎబోలా ప్రభావిత దేశాల్లో ప్రయాణించినవారు.. అలాగే ఆ దేశాల మీదుగా భారతదేశంలోకి వచ్చిన ప్రయాణికులు స్వీయ నిర్బంధంలోకి వెళ్లాలని కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ సూచించింది. ఇప్పటి వరకూ మనదేశంలో ఎబోలా కేసులు నమోదు కాలేదని క్లారిటీ ఇచ్చింది. అయితే ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని కేంద్రం హెల్త్ అడ్వైజరీ జారీ చేసింది. గత 21 రోజులలో ఎవరైనా ఎబోలా ప్రభావిత దేశానికి వెళ్లి వచ్చి ఉంటే సెల్ఫ్ క్వారంటైన్‌లోకి వెళ్లాలని సూచించింది. అలాగే ఎబోలా ప్రభావిత దేశాల మీదుగా వచ్చినా కూడా ఈ నిబంధనలు పాటించాలని విజ్ఞప్తి చేసింది. తలనొప్పి, కండరాల నొప్పి, జ్వరం, వాంతులు, విరేచనాలు వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే సెల్ఫ్ క్వారంటైన్‌లోకి వెళ్లాలని సూచించింది. అలాగే దగ్గరలోని ఆరోగ్య సిబ్బందికి సమాచారం అందించాలని సూచించింది. ఏవైనా సహాయం కావాలంటే 1075 నంబర్‌కు ఫోన్ చేయాలని సూచించిన కేంద్ర ఆరోగ్య శాఖ.. ముందస్తు సమాచారంతో మీ ప్రాణాలతో పాటుగా వైరస్ వ్యాప్తిని అడ్డుకోవచ్చని పిలుపునిచ్చింది.

# 24 గంటల్లో విదేశీయుల వివరాలివ్వాలి

మొదటి పేజీ తరువాయి

సూచనలు జారీ చేశారు. హోటళ్లు, లాడ్జీలు, గెస్ట్ హౌస్‌లు, అద్దె ఇళ్ల యజమానులు, ఆసుపత్రులు, విశ్వవిద్యాలయాలు, కళాశాలలు సహా విదేశీయులకు ఆశ్రయం కల్పించే వారందరూ ఈ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని ఆదేశించారు. విదేశీ పాస్‌పోర్ట్ హోల్డర్లు, ఓవర్సీస్ సిటిజన్ ఆఫ్ ఇండియా (ఓసీఐ) కార్డు ఉన్నవారు, నేపాల్ జాతీయులతో సహా ఏ విదేశీయుడు తమ ప్రాంగణంలో బస చేసినా, నిర్దేశిత ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా ఫారం-3 (ఫారం-సి) సమర్పించాలి. విద్యాసంస్థలు విదేశీ విద్యార్థుల వివరాలను ఫారం-2లో నమోదు చేయాలి. వారు తిరిగి వెళ్లిన వివరాలను కూడా రిపోర్ట్ చేసి, ఆ రికార్డులను కనీసం ఏడాది పాటు భద్రపరచుకోవాలి. 2025 సెప్టెంబర్‌లో అమల్లోకి వచ్చిన కొత్త ఇమ్మిగ్రేషన్ చట్టం అమలులో భాగంగానే ఈ చర్యలు తీసుకుంటున్నట్టు పోలీసులు తెలిపారు. దేశంలో విదేశీయుల కదలికలపై పర్యవేక్షణను పటిష్టం చేయడమే దీని లక్ష్యం. తప్పుడు సమాచారం ఇచ్చినా లేదా వాస్తవాలను దాచిపెట్టినా చట్ట ప్రకారం శిక్షార్హులవుతారని స్పష్టం చేశారు. ఎలాంటి చట్టపరమైన చిక్కులు రాకుండా ఉండేందుకు అందరూ ఈ నిబంధనలను కచ్చితంగా పాటించాలని పోలీసులు సూచించారు.

## తొలి ఫ్లెక్స్ ఫ్యూయెల్ కారు లాంచ్

మొదటి పేజీ తరువాయి

నడుస్తుంది. ఇది డిజైన్ పరంగా జు20 మోడల్‌ను పోలి ఉంటుంది. ధర, ఇతర వివరాలు అధికారికంగా చెప్పనప్పటికీ.. సుమారు రూ. 8.50 లక్షల వరకు ఉండొచ్చని అంచనా వేస్తున్నారు. ఫ్లెక్స్ ఫ్యూయెల్ టెక్నాలజీ.. భారత్ ఇంధన దిగుమతులపై ఆధారపడటాన్ని గణనీయంగా తగ్గిస్తుందని కేంద్ర మంత్రులు చెప్పారు. ఇక భారత ఇంధన రంగంలో కొత్త అధ్యాయం మొదలైందని మారుతీ సుజుకీ ఎండీ, సీఈఓ హిసాషీ టకేయుచి పేర్కొన్నారు. ఇక్కడ మారుతీ వ్యాగన్ ఆర్ ఫ్లెక్స్ ఫ్యూయెల్ కారులో 85 నుంచి 100 శాతం వరకు కూడా ఇథనాల్ వినియోగించే అవకాశం ఉంటుంది.

## లాసెట్‌లో దేవ్‌జీకి 349 ర్యాంకు

మొదటి పేజీ తరువాయి

సాధించారు. కొద్ది రోజుల క్రితం డీజీపీ ఎదుట లొంగిపోయిన ఆయన.. మళ్లీ పుస్తకాల బాట పట్టారు. అడవిలో గన్‌ను వదిలి.. జన జీవన స్రవంతిలో కలం పట్టి ఇంటర్ ఎగ్జామ్ రాశారు. గత నెల 13న ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం తెలుగు పరీక్షకు హాజరయ్యారు. ఆ ఫలితాలు వెల్లడి కావాల్సి ఉంది.

## 700 తిమింగళాలు, డాల్ఫిన్‌ల ఊచకోత

మొదటి పేజీ తరువాయి

వాటి శరీరాలని చీల్చారు. అదేవిధంగా స్కాలబోట్నూర్‌లో 168 వైట్ సైడెడ్ డాల్ఫిన్‌లు, హోల్విక్‌లో 132 వైట్ సైడెడ్ డాల్ఫిన్‌లను చంపేశారు. వాటిని చంపేందుకు ఉపయోగించే ఆయుధాల కొరత ఏర్పడటంతో.. కొక్కేలు, కత్తులు ఉపయోగించి వాటి శరీరాలను చీల్చేశారు. దాంతో అవి ఒడ్డున విలవిలా కొట్టుకుంటూ ప్రాణాలు వదిలాయి. ఈ వధను చిన్నారులు సహా అనేకమంది సముద్రపు ఒడ్డున ఉండి చూడటం గమనార్హం. సీ షెఫర్డ్‌లోని ఫారో దీవుల డైరెక్టర్ వాలెంటీనా క్రాస్ట్.. దీన్ని తీవ్రంగా ఖండించారు. అమాయక జంతువులను ఇంత క్రూరంగా బాధించి చంపడాన్ని సమర్థించలేమన్నారు. ఈ సంప్రదాయాన్ని నిషేధించాలని డిమాండ్ చేశారు. కాగా ఈ సామూహిక వధ అనేది 1000 ఏళ్ల నాటి సంప్రదాయంగా అక్కడి వారు చెబుతున్నారు. అయితే జంతు ప్రేమికులు దీనిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. ఆధునిక కాలంలో ఇది అనాగరికమైన చర్య అని, కాలం చెల్లిన పద్ధతిగా దీన్ని అభివర్ణిస్తున్నారు. వెంటనే దీన్ని ఆపేయాలంటూ ప్రభుత్వాలను డిమాండ్ చేస్తున్నారు. ఈ సామూహిక వధకి ముందురోజు ఫారోస్ పార్లమెంటులో వేటాడే డాల్ఫిన్‌ల కోసం ఉన్న సంక్షేమ చట్టాన్ని సవరించడం గమనార్హం.

## పర్మిషన్ మీ ఇష్టం.. ధర్నా మాత్రం ఆగదు!

మొదటి పేజీ తరువాయి

లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తు అంధకారంగా మారడంపై ఈ వేదిక గళమెత్తుతోంది. ప్రస్తుతం బోస్టన్‌లో ఉన్న పార్టీ వ్యవస్థాపకుడు అభిజిత్ డిప్కే, ఈ నిరసన కార్యక్రమానికి నేతృత్వం వహించేందుకు జూన్ 6వ తేదీ ఉదయం 8 గంటలకు ఢిల్లీ చేరుకోనున్నారు. ఆయన వచ్చిన తర్వాతే పోలీసుల అనుమతి కోరుతూ దరఖాస్తు చేస్తామని.. ప్రజాస్వామ్య నిరసనలకు అధికార యంత్రాంగం కల్పిస్తున్న అడ్డంకులను నిరసించడానికే ఈ నిర్ణయం తీసుకున్నామని సీజేపీ ప్రతినిధులు సౌరవ్ దాస్, విజేతా దహియా, అశుతోష్ రాంకా వెల్లడించారు. ఈ ఉద్యమానికి ప్రముఖ విద్యావేత్త, పర్యావరణ కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్ ఇప్పటికే తన మద్దతు ప్రకటించారు. విద్యా వ్యవస్థలో సంస్కరణల దిశగా ప్రభుత్వం జూన్ 5వ తేదీలోగా తగిన చర్యలు తీసుకోని పక్షంలో, తాను కూడా ఈ నిరసనలో పాలుపంచుకుంటానని ఆయన హెచ్చరించారు.ద

## ఈతకు వెళ్లి నలుగురు చిన్నారులు మృతి

**మృతుల్లో ఇద్దరు అన్నదమ్ములు**

**ప్రకాశం జిల్లా చెరువుకొమ్ముపాలెంలో ఘటన**

ఒంగోలు, జూన్ 4 (ఈవార్తలు): ఏపీలోని ప్రకాశం జిల్లాలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. గురువారం నాడు ఒంగోలు మండలం పరిధిలోని చెరువుకొమ్ముపాలెం గ్రామంలో ఈతకు వెళ్లి నలుగురు చిన్నారులు నీట మునిగి ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటనతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. వివరాల్లోకి వెళితే, మృతులను కర్రేటి అభిరామ్ (14), కర్రేటి సుశాంత్ (12), పొదిలి చిన్ను (11), ఇల్ల దినేష్ (10)గా గుర్తించారు. వీరిలో అభిరామ్, సుశాంత్ అన్నదమ్ములు. వేసవి తాపం అధికంగా ఉండటంతో ఉపశమనం కోసం వీరంతా సరదాగా ఈత కొట్టేందుకు గ్రామ సమీపంలోని ఓ నీటి గుంట వద్దకు వెళ్లారు. ప్రమాదవశాత్తు నీటిలో మునిగిపోయారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది, స్థానిక గజ ఈతగాళ్లు ఘటనా స్థలానికి చేరుకుని గాలింపు చర్యలు చేపట్టారు. కొద్దిసేపటి తర్వాత నలుగురి మృతదేహాలను వెలికితీశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



# రూపాయి కూడా తేలేదు

**కిషన్ రెడ్డి, బండి సంజయ్‌పై కడియం ఫైర్**

స్టేషన్ ఘన్‌పూర్, జూన్ 4 (ఈవార్తలు): కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్‌లతో పాటు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. తన క్యాంప్ ఆఫీస్‌లో నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో మాట్లాడిన ఆయన.. కేంద్ర మంత్రులు ఇద్దరూ తెలంగాణ అభివృద్ధికి ఒక్క రూపాయి కూడా అదనంగా తీసుకురాలేదని, వారి వల్ల రాష్ట్రానికి ఎలాంటి ఉపయోగం లేదంటూ ఘాటు వ్యాఖ్యలు చేశారు. ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రజల దశాబ్దాల కల అయిన 'కాజీపేట రైల్వే డివిజన్'ను తక్షణమే ఏర్పాటు చేయాలని శ్రీహరి కేంద్ర ప్రభుత్వాన్ని గట్టిగా డిమాండ్ చేశారు. ఈ డివిజన్ ఏర్పాటు ద్వారా ఈ ప్రాంతంలో పారిశ్రామిక వృద్ధి పెరగడమే కాకుండా, స్థానిక యువతకు పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు లభిస్తాయని ఆయన స్పష్టం చేశారు. గత 12 ఏళ్లుగా బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం తెలంగాణను ఉద్దేశపూర్వకంగానే నిర్లక్ష్యం చేస్తోందని.. అసలు ప్రధాని మోదీకి, బీజేపీకి తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ఇష్టం లేదని ఆరోపించారు. కేంద్ర మంత్రులు కేవలం రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై విమర్శలు చేయడమే పనిగా పెట్టుకున్నారని, బండి సంజయ్ చెబుతున్న రూ.13 లక్షల కోట్ల నిధుల్లో రాష్ట్రానికి వచ్చిన ప్రాజెక్టులు ఏవో శ్వేతపత్రం విడుదల చేయాలని సవాల్ విసిరారు. ఇదే సమావేశంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీరును కూడా శ్రీహరి తప్పుపట్టారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై కేటీఆర్ వాడుతున్న భాష ఏమాత్రం సమర్థనీయం కాదన్నారు. "ప్రజల చేత ఎన్నికైన ఒక ముఖ్యమంత్రిని 'తెలంగాణ ద్రోహి' అని పిలవడం కేటీఆర్ అహంకారానికి నిదర్శనం. అధికారం కోల్పోవడంతోనే ఆయన ఇలా మాట్లాడుతున్నారు. ఆయనకు నాయకత్వ లక్షణాలు లేవనే విషయాన్ని స్వయంగా ఆయన సోదరే (కవిత) గతంలో చెప్పిన విషయాన్ని గుర్తుంచుకోవాలి" అని వ్యాఖ్యానించారు. కేటీఆర్ తన రాజకీయ శైలిని, భాషను మార్చుకోకపోతే ప్రజలే బుద్ధి చెబుతారని హెచ్చరించారు.



# విహారయాత్రలా రేవంత్ పర్యటన

**మాజీమంత్రి శ్రీనివాస్ గౌడ్ ఆరోపనలు**

హైదరాబాద్, జూన్ 4 (ఈవార్తలు): పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం అవలంబిస్తున్న తీరుపై బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. తెలంగాణ భవన్‌లో జరిగిన ప్రెస్‌మీట్‌లో ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ నేతలు పాదయాత్రకు సిద్ధమైనప్పుడే ప్రభుత్వానికి ప్రాజెక్టుల తనిఖీలు గుర్తొస్తున్నాయని, ఇందులో వారి చిత్తశుద్ధి ఏపాటిదో అర్థమవుతోందని ఎద్దేవా చేశారు. కేసీఆర్ హయాంలోనే ఈ ప్రాజెక్టుల పనులు 80 నుంచి 90 శాతం పూర్తయ్యాయని, మిగిలిన పనులను కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగానే ఆలస్యం చేస్తోందని ఆరోపించారు. సీఎం రేవంత్ రెడ్డి పర్యటన కేవలం పబ్లిసిటీ కోసం చేసిన 'హెలికాప్టర్ విహారయాత్ర' లాంటిదేనని విమర్శించారు. కొల్లాపూర్ ప్రాంతంలో హార్టికల్చర్, పాలిటెక్నిక్ కాలేజీల ఏర్పాటును పక్కనబెట్టారని, మామిడి రైతులకు న్యాయం చేయలేదని మండిపడ్డారు. అలాగే, బీఆర్ఎస్ నేత శ్రీధర్ రెడ్డి హత్య జరిగి రెండేళ్లవుతున్నా విచారణలో పురోగతి లేదని, సీఎం పర్యటనల వేళ ప్రతిపక్ష నేతలను అక్రమంగా అరెస్ట్ చేస్తున్నారని ధ్వజమెత్తారు. ముఖ్యమంత్రి పిక్నిక్ తరహా పర్యటనలు ఆపి, పాలమూరు అసలు సమస్యలపై, 'రామన్నగుట్ట రిజర్వాయర్' ప్రాజెక్టుపై స్పష్టమైన సమీక్ష నిర్వహించాలని శ్రీనివాస్ గౌడ్ డిమాండ్ చేశారు.

# పవన్ భాష సరిగా లేదు: గుత్తా

హైదరాబాద్, జూన్ 4 (ఈవార్తలు): తెలంగాణ శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి ఆంధ్రప్రదేశ్ కూటమి నాయకులకు, ముఖ్యంగా డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌కు గట్టి కౌంటర్ ఇచ్చారు. మీడియా ప్రతినిధులతో జరిగిన చిట్‌చాట్‌లో ఆయన ఏపీ నాయకుల తీరుపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. తెలంగాణ ఆవిర్భావ వేడుకలు జరుగుతున్న ఈ కీలక సమయంలో.. ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఇక్కడ సభలు



నిర్వహిస్తామనడం ఎంతమాత్రం సరైనది కాదని గుత్తా సుఖేందర్ రెడ్డి స్పష్టం చేశారు. అంతేకాకుండా, ఇటీవల జరిగిన మీడియా సమావేశంలో పవన్ కల్యాణ్ మాట్లాడిన భాష, ఆయన తీరు అస్సలు బాలేదని వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్ రాజధానిపై కూడా గుత్తా సుఖేందర్ రెడ్డి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. "అమరావతి బ్రహ్మాండమైన రాజధాని అని చెబుతున్న ఏపీ సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, అక్కడి మంత్రులు ముందు అమరావతిలోనే నివాసం ఉండాలి" అని సూచించారు. తెలంగాణతో పోలిస్తే ఆంధ్రప్రదేశ్‌లోనే ఎక్కువ వనరులు ఉన్నాయని ఆయన గుర్తు చేశారు. ఏపీకి సుదీర్ఘమైన సముద్ర తీరంతో పాటు, రకరకాల పోర్టులు కూడా ఉన్నాయని... కాబట్టి ఆ నాయకులంతా వారి రాష్ట్ర అభివృద్ధిని చూసుకోవాలి తప్ప, తెలంగాణ వైపు చూడాల్సిన అవసరం లేదని హితవు పలికారు. ఇక్కడ ఎలాంటి విద్వేషాలు సృష్టించడానికి ప్రయత్నించవద్దని హెచ్చరించారు. తెలంగాణ వ్యవసాయ రంగం, ధాన్యం కొనుగోళ్లపై గుత్తా సుఖేందర్ రెడ్డి పలు వివరాలను పంచుకున్నారు. తెలంగాణలో ఇప్పటికే 75 శాతం ధాన్యం సేకరణ పూర్తయిందని ఆయన తెలిపారు. రాష్ట్రంలో ధాన్యం కొనుగోళ్లకు కేంద్ర ప్రభుత్వం ఏమాత్రం సహకరించడం లేదని ఆరోపించారు. రైతులు సాంప్రదాయ పద్ధతుల్లోనే కాకుండా పంట మార్పిడి వైపు దృష్టి సారించాలని కోరారు. ప్రస్తుతం మన రైతులు వరి, పత్తి తప్ప వేరే ఇతర పంటలు పండించడం లేదని, దీనిపై మార్పు రావాలని ఆయన వివరించారు.



# రాష్ట్రంలో బ్యాటరీ ఇంధన నిల్వ ప్లాంట్లు

**బ్యాకప్ కోసం జెన్‌కో మాస్టర్ ప్లాన్.. ఎకరా భూమి లీజు కేవలం ఒక్క రూపాయికే**

హైదరాబాద్, జూన్ 4 (ఈవార్తలు): తెలంగాణలో విద్యుత్ కొరతను అధిగమించడానికి, గ్రేటర్ హైదరాబాద్ నగరానికి అంతరాయం లేని విద్యుత్ సరఫరాను అందించడానికి తెలంగాణ ప్రభుత్వం కీలక అడుగు వేసింది. తక్కువ ధరకే భూములను లీజుకు ఇస్తూ భారీ బ్యాటరీ ఇంధన నిల్వ ప్లాంట్ల ఏర్పాటుకు ప్రభుత్వం టెండర్లను ఖరారు చేసింది. రాజధాని శివారు ప్రాంతమైన రంగారెడ్డి జిల్లా మహేశ్వరం, యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ పరిసరాల్లో ట్రాన్స్‌కోకు ఉన్న ప్రభుత్వ భూముల్లో ఈ ప్లాంట్లు ఏర్పాటు కానున్నాయి. ఈ మెగా ప్రాజెక్టును ఆకర్షణీయంగా మార్చడానికి ప్రభుత్వం ల్యాండ్ లీజ్ పాలసీలో భారీ రాయితీ ప్రకటించింది. ప్లాంట్లను ఏర్పాటు చేసే ప్రైవేట్, ప్రభుత్వ సంస్థలకు ఎకరా భూమిని ఏడాదికి కేవలం రూ.1 చొప్పున, 15 సంవత్సరాల కాలపరిమితితో లీజుకు ఇవ్వనున్నారు. మహేశ్వరం, చౌటుప్పల్‌లలో ఒక్కొక్కటి 187.5 మెగావాట్ల సామర్థ్యంతో ఈ గ్రిడ్ ఆధారిత ప్లాంట్లు నిర్మితమవుతాయి. ప్లాంట్ నిర్మించే సంస్థలు రోజులో విద్యుత్ డిమాండ్ ఎక్కువగా ఉండే సమయంలో ఖచ్చితంగా 4 గంటల పాటు బ్యాటరీల నుండి కరెంట్‌ను సాధారణ విద్యుత్ గ్రిడ్‌కు సరఫరా చేయాలి. ఇలా రోజుకు రెండు విడతలుగా మొత్తం 8 గంటలు 1500 మెగావాట్ల కరెంట్‌ను సరఫరా చేస్తారు. ఈ బ్యాటరీ విద్యుత్‌ను కొనుగోలు చేయడానికి దక్షిణ విభాగా విద్యుత్ పంపిణీ సంస్థ ఒప్పందం చేసుకోవాల్సి ఉంటుంది. ఈ ప్లాంట్ల ఏర్పాటును పర్యవేక్షించి, డిస్కంలకు విద్యుత్ విక్రయాలు జరిపించినందుకు గాను ప్రతి యూనిట్‌కు 7 పైసల చొప్పున జెన్‌కో కమీషన్ రూపంలో ఆదాయాన్ని పొందుతుంది. ఈ ప్రాజెక్టు కోసం తొలుత 16 కంపెనీలు టెండర్లు దాఖలు చేశాయి. ప్రారంభంలో ఒక మెగావాట్‌కు నెలకు మహేశ్వరం ప్లాంటుకు రూ.3.06 లక్షలు, చౌటుప్పల్ ప్లాంటుకు రూ.3.25 లక్షల ధర కోట్ చేయగా.. అది చాలా ఎక్కువగా ఉందని జెన్‌కో భావించింది. దీంతో పారదర్శకత కోసం అధికారులు రివర్స్ బిడ్డింగ్ విధానాన్ని అమలు చేశారు. ఈ రీ-టెండర్లలో ధరలు భారీగా తగ్గాయి. మహేశ్వరానికి రూ.2.98 లక్షల అత్యల్ప ధరకు ఒక ప్రైవేట్ కంపెనీ, చౌటుప్పల్ ప్లాంటుకు రూ.3.14 లక్షల ధరకు ప్రభుత్వ రంగ సంస్థ కోల్ ఇండియా టెండర్లను కైవసం చేసుకున్నాయి. గతేడాది హైదరాబాద్ శివారు శంకర్‌పల్లిలో ఈ ప్లాంట్ ఏర్పాటు చేయాలని భావించినప్పటికీ.. టెండర్ల ఆమోదంలో జాప్యం జరగడంతో కేంద్రం అప్పట్లో కేటాయించిన రూ.27 లక్షల వయబిలిటీ గ్యాప్ ఫండింగ్ రద్దయింది. అయినప్పటికీ ప్రస్తుత కొత్త ప్రాజెక్టుకు కేంద్ర ప్రభుత్వం మెగావాట్‌కు రూ.18 లక్షల చొప్పున వీజీఎఫ్ నిధులను మంజూరు చేయనుందని జెన్‌కో స్పష్టం చేసింది. తెలంగాణలో ఇంతవరకు ప్రభుత్వ రంగ సంస్థ అయిన సింగరేణి మాత్రమే ప్రయోగాత్మకంగా చిన్న బ్యాటరీ నిల్వ ప్లాంటును ఏర్పాటు చేయగా.. ఇంత పెద్ద ఎత్తున గ్రిడ్ బ్యాకప్ ప్లాంట్లు రావడం ఇదే తొలిసారి. ఈ టెండర్ల ప్రక్రియ అంతా పూర్తయినందున దీనికి తుది అనుమతులు ఇవ్వాలని కోరుతూ జెన్‌కో.. రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలికి పిటిషన్ సమర్పించింది. ఈ ప్రాజెక్టుపై ప్రజలు, నిపుణులు తమ సలహాలు, సూచనలను ఈనెల 8 లోపు ఈఆర్‌సీకి ఇవ్వవచ్చు. అనంతరం జూన్ 18న దీనిపై ఈఆర్‌సీ నేతృత్వంలో బహిరంగ విచారణ జరగనుంది.

# వైఎస్ చనిపోయాక ఆరోపణలేంటి?

**పవన్‌కు కేవీపీ రామచంద్రరావు లేఖ**

**వైసీపీకి, వైఎస్సార్‌కు సంబంధం లేదని వ్యాఖ్య**

**పాత కక్షలు మర్చిపోవాలని హితవు**



హైదరాబాద్, జూన్ 4 (ఈవార్తలు): దివంగత వైఎస్ రాజశేఖర రెడ్డి పాలనపై ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కల్యాణ్ తీవ్ర వ్యాఖ్యలు చేయడం తెలిసిందే. వైఎస్సార్ హయాంలో రాష్ట్రంలో ప్రజాస్వామ్యం లేదని, ప్రజలు రోడ్డుపైకి రావాలంటేనే భయపడేవారంటూ పవన్ చేసిన కామెంట్స్ పై కాంగ్రెస్ సీనియర్ నేత, వైఎస్సార్ ఆత్మబంధువు డాక్టర్ కేవీపీ రామచందర్ రావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పవన్ కల్యాణ్‌ను టార్గెట్ చేస్తూ ఒక ఘాటు బహిరంగ లేఖను సంధించారు. "కాంగ్రెస్ అనగానే మీకు వైఎస్సార్ గుర్తుకు వచ్చినందుకు ధన్యవాదాలు" అంటూనే... వైఎస్సార్‌పై పవన్ చేసిన ఆరోపణలను కేవీపీ తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా ఆయన ఒక ముఖ్యమైన రాజకీయ అంశాన్ని స్పష్టం చేశారు. వైఎస్సార్‌కు, ప్రస్తుత వైసీపీకి ఎలాంటి సంబంధం లేదని కేవీపీ తేల్చి చెప్పారు. వైఎస్సార్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో పవన్ పై ఎలాంటి అక్రమ కేసులు పెట్టలేదని కేవీపీ గుర్తు చేశారు. నాడు వైఎస్సార్ కేసులు పెట్టమన్నారంటూ ఓ పోలీస్ అధికారికి తనకు చెప్పినట్టు పవన్ అంటున్నారని, ఆ పోలీస్ అధికారికి తక్షణమే లై డిటెక్టర్ పరీక్ష చేయించాలని కేవీపీ డిమాండ్ చేశారు. "ఒకవేళ ఆ అధికారి చెప్పింది నిజమని తేలితే... నేను తెలంగాణ సీఎం రిలీఫ్ ఫండ్‌కు రూ.10 కోట్లు విరాళంగా ఇస్తాను" అంటూ కేవీపీ ఒక బహిరంగ సవాల్ విసిరారు. మహానేత వైఎస్ రాజశేఖర రెడ్డి చనిపోయి 17 ఏళ్లు దాటిన తర్వాత కూడా.. ఇంకా ఆయనపై ఇలాంటి ఆధారాలు లేని ఆరోపణలు చేయడం అవివేకమని మండిపడ్డారు. తెలుగు రాష్ట్రాల్లో కాంగ్రెస్ పార్టీ ఇంకా చాలా బలంగా ఉందనే విషయాన్ని పవన్ గుర్తుంచుకోవాలన్నారు. తెలంగాణలో ఇచ్చిన హామీలను, విభజన చట్టం ప్రకారం రావాల్సిన ప్రయోజనాలను సాధించడం కోసం.. ఏపీ సీఎం చంద్రబాబుతో పాటు కేంద్ర ప్రభుత్వంపై పవన్ ఒత్తిడి తీసుకురావాలని హితవు పలికారు. పాత కక్షలను తవ్వుకుంటూ కూర్చోకుండా, డిప్యూటీ సీఎంగా ప్రజా సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టాలని లేఖలో పేర్కొన్నారు.



# పలు జిల్లాల్లో భారీ వర్షం

**ఈదురుగాలులతో ఆగమాగం**

కరీంనగర్/సిద్దిపేట, జూన్ 4 (ఈవార్తలు): తెలంగాణలోని పలు జిల్లాలలో గురువారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వాన కారణంగా అనేక చోట్ల లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. పలు పట్టణాలు, గ్రామాల్లో రహదారులపై వర్షపు నీరు ఉధృతంగా ప్రవహించడంతో సాధారణ జనజీవనానికి తీవ్ర అంతరాయం ఏర్పడింది. జనగామ జిల్లా స్టేషన్ ఘన్‌పూర్, కరీంనగర్ పట్టణం, హుజూరాబాద్, సిద్దిపేట జిల్లాలోని హుస్నాబాద్, భీమదేవరపల్లి, ఎల్కతుర్తి మండలాలతో పాటు ములుగు జిల్లాలోని మల్లంపల్లి, వెంకటాపూర్, ములుగు మండలాల్లో వర్షం బీభత్సం సృష్టించింది. పలుచోట్ల రోడ్లు వాగులను తలపించడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు తలెత్తాయి.

# రిజిస్ట్రేషన్ ఆఫీసులకు పోటెత్తిన జనం

**భూముల విలువ పెంపు ఎఫెక్ట్.. పనివేళలు పొడిగించిన ప్రభుత్వం**

**రాత్రి 7:30 గంటల వరకు రిజిస్ట్రేషన్లు**

హైదరాబాద్, జూన్ 4 (ఈవార్తలు): రాష్ట్రంలో భూముల మార్కెట్ విలువలు, రిజిస్ట్రేషన్ ఛార్జీలు పెరగనున్నాయనే వార్తల నేపథ్యంలో సబ్-రిజిస్ట్రార్ కార్యాలయాలు జనంతో కిటకిటలాడాయి. పాత ధరలకే రిజిస్ట్రేషన్లు పూర్తి చేసుకునేందుకు గురువారం ఉదయం నుంచే ప్రజలు భారీగా తరలివచ్చారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. జూన్ 4న రాత్రి 7:30 గంటల వరకు పనివేళలను పొడిగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం మార్కెట్‌లో ఉన్న వాస్తవ ధరలకు, అధికారిక రిజిస్ట్రేషన్ విలువలకూ మధ్య ఉన్న వ్యత్యాసాన్ని తగ్గించడం ద్వారా ప్రభుత్వ ఆదాయాన్ని పెంచుకోవాలని ప్రభుత్వం భావిస్తోంది. ఇది రేపటి నుంచి అమలులోకి వస్తుండటంతో, పెరిగే ఛార్జీల భారం నుంచి తప్పించుకునేందుకు కొనుగోలుదారులు కార్యాలయాల వద్ద బారులు తీరారు. ప్రజల రద్దీ, విజ్ఞప్తులను పరిగణనలోకి తీసుకున్న రెవెన్యూ శాఖ, ప్రత్యేకంగా గురువారం పనివేళలను పొడిగించింది.

# అమీర్‌పేటలో భారీ అగ్ని ప్రమాదం

**ఆటబొమ్మల దుకాణంలో మంటలు**

**స్తంభించిన ట్రాఫిక్.. తప్పిన ప్రాణ నష్టం**

అమీర్‌పేట-హైదరాబాద్, జూన్ 4 (ఈవార్తలు): నిత్యం రద్దీగా ఉండే హైదరాబాద్ అమీర్‌పేటలో భారీ అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. మైత్రివనం దగ్గర్లోని కేఎస్ఆర్ షాపింగ్ మాల్‌లో మంటలు చెలరేగాయి. తొలుత ఓ ఆటబొమ్మల దుకాణంలో చెలరేగిన మంటలు క్రమంగా షాపింగ్ కాంప్లెక్స్ మొత్తం వ్యాపించాయి. పెద్ద ఎత్తున ప్లాస్టిక్ వస్తువులు ఉండడంతో మంటలు వేగంగా అంటుకున్నాయి. మైత్రివనం ప్రాంతంలో అనేక ఆఫీసులు, కోచింగ్ సెంటర్లు, కమర్షియల్ కాంప్లెక్స్‌లు ఉంటాయనే విషయం తెలిసిందే. మంటల ధాటికి ఆ ప్రాంతమంతా పెద్ద ఎత్తున పొగ అలముకుంది. రోడ్డు కనపడనంత తీవ్రంగా పొగ కమ్మేయడంతో ట్రాఫిక్ స్తంభించిపోయింది. సమాచారం అందుకున్న వెంటనే అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకున్నాయి. నాలుగు ఫైరింజన్లు మంటలను ఆర్పుతున్నాయి. మరోవైపు పోలీసులు ట్రాఫిక్‌ను మళ్లించే ప్రయత్నం చేస్తున్నారు. మంటలు చెలరేగిన వెంటనే షాపింగ్ కాంప్లెక్స్‌లోని వారంతా బయటకు పరిగెత్తుకొచ్చారు. దీంతో ఎలాంటి ప్రాణనష్టం సంభవించలేదని ప్రాథమికంగా పోలీసులు తేల్చారు. కానీ, చాలా దుకాణాలు దగ్ధం అవడంతో ఆస్తి నష్టం మాత్రం భారీగా ఉండే అవకాశం ఉంది. అలాగే షార్ట్ సర్క్యూటే ప్రమాదానికి కారణమై ఉండొచ్చని అనుమానిస్తున్నారు. మరోవైపు సమీపంలోనే మెట్రో స్టేషన్‌లో కార్యకలాపాలకు ఎలాంటి అంతరాయం లేదని అధికారులు తెలిపారు.

# బాల్క సుమన్‌తో కేటీఆర్ ములాఖత్

చంచల్‌గూడ-హైదరాబాద్, జూన్ 4 (ఈవార్తలు): చంచల్‌గూడ కేంద్ర కారాగారంలో రిమాండ్ ఖైదీగా ఉన్న బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్‌ను ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఈరోజు ములాఖత్‌లో కలిశారు. కేటీఆర్‌తో పాటు పార్టీ సీనియర్ నేతలు తలసాని శ్రీనివాస్ యాదవ్, సుధీర్ రెడ్డి కూడా బాల్క సుమన్‌ను పరామర్శించిన వారిలో ఉన్నారు. జైల్లో ఉన్న సుమన్‌కు పార్టీ పూర్తి అండగా ఉంటుందని ఈ సందర్భంగా కేటీఆర్ భరోసా ఇచ్చారు. సింగరేణి కాలరీస్ ఆస్తులను ధ్వంసం చేయాలంటూ, రైలు పట్టాలు కోసేయాలంటూ బాల్క సుమన్ ఇటీవల రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేశారు. ఈ క్రమంలో ఆయనపై నాంపల్లి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ఆ తర్వాత ఈ కేసును బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్‌కు బదిలీ చేశారు. గడిచిన మే 26న తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ నిర్వహించిన బహిరంగ సభలో బాల్క సుమన్ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారని పేర్కొంటూ.. సింగరేణి కాలరీస్‌కు చెందిన జూనియర్ అసిస్టెంట్ ఆనంద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు ఈ అరెస్ట్ చర్యలు చేపట్టారు.

మీరిచ్చే ప్రతి పైసా..
ప్రజాస్వామ్య పరిరక్షణకే!

ఉన్నది ఉన్నట్లు చెప్పే తత్వం..
ఎవరికీ కొమ్ముకాయని పథం..
ప్రజా సమస్యలపై యుద్ధం..
ప్రజా హితమే మా శపథం..
ప్రజాపోరులో మేము సంసిద్ధం..
ఇదే నేటి 'ఈవార్తలు' నైజం!

అక్షరమే అస్త్రంగా, ప్రభుత్వాన్ని సరైన దారిలో నడిపించే శస్త్రంగా, వార్తలను నిక్కచ్చిగా అందిస్తూ సాగుతున్న అలుపెరుగని ప్రయాణం మాది. పాలకుల తప్పులను ఎండగడుతూ, వ్యవస్థలను గాడిలో పెట్టే శక్తిమంతమైన శస్త్రం నేటి 'ఈవార్తలు'. ఎవరికీ తలొగ్గని కలం, న్యాయం కోసం గొంతెత్తే గళం.. మన పత్రిక. నిష్పక్షపాత జర్నలిజం మనుగడ సాగించాలంటే అది ప్రజాబలంతోనే సాధ్యం. మీరు అందించే ప్రతి పైసా ఆర్థిక దన్ను మాత్రమే కాదు, అక్రమాలపై మేము ఎక్కుపెట్టే అస్త్రానికి పదును. ప్రజాసమస్యలపై రాజీలేని పోరాటానికి, నిజాలను నిర్భయంగా చాటిచెప్పడానికి మాతో చేయి కలపండి. సత్యాన్వేషణలో భాగస్వాములుకండి.. ప్రజాస్వామ్య పరిరక్షణలో తోడుగా నిలవండి.

- శ్రావణ్ కుమార్ బొమ్మకంటి, ఎడిటర్

సందేహాలకు 94404 55811
నంబర్‌ను సంప్రదించవచ్చు.



# మీనాక్షీనటరాజన్‌కు రాజ్యసభ సీటు

హైదరాబాద్, జూన్ 4 (ఈవార్తలు) : రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల(ఏఐసీసీ) ఇన్‌చార్జి మీనాక్షీనటరాజన్‌కు కాంగ్రెస్ అధిష్ఠానం రాజ్యసభ సీటు ప్రకటించింది. ఆమె సొంత రాష్ట్రం మధ్యప్రదేశ్ నుంచి రాజ్యసభ అభ్యర్థిగా కాంగ్రెస్ అధిష్ఠానం అవకాశం కల్పించింది. దేశవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీకి 7 రాజ్యసభ సీట్లు దక్కనున్నాయి. ఈ ఏడు స్థానాలకు గురువారం రాత్రి అభ్యర్థులను ప్రకటించింది. కర్ణాటకలో 3 స్థానాలకు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేకు మరోసారి అవకాశం కల్పించగా, మరో రెండు స్థానాలకు పవన్‌ఖేరా, మన్సూల్ అలీఖాన్‌ను ఎంపిక చేసింది. రాజస్థాన్ నుంచి నీరజ్ డాంగి, తమిళనాడు నుంచి ప్రవీణ్‌చక్రవర్తి, జార్ఖండ్ నుంచి ప్రణవ్ ఝూను ప్రకటించింది.

# సస్పెండెడ్ ఏఎస్పీ భుజంగరావు అరెస్ట్

**రూ.100 కోట్లకు పైగా ఆస్తుల గుర్తింపు**

**ఫోన్ ట్యాపింగ్ కేసులో నిందితుడు**

హైదరాబాద్, జూన్ 4 (ఈవార్తలు): రాష్ట్రంలో సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో నిందితుడిగా ఉన్న సస్పెండెడ్ అదనపు ఎస్పీ నాయిని భుజంగరావును అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అరెస్ట్ చేసింది. ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో ఆయనను అరెస్ట్ చేసి, కోర్టులో హాజరుపరచగా న్యాయస్థానం జ్యుడీషియల్ రిమాండ్ విధించింది. దీంతో అధికారులు ఆయన్ను చంచల్‌గూడ సెంట్రల్ జైలుకు తరలించారు. నిన్న ఉదయం నుంచి ఏసీబీ అధికారులు భుజంగరావుతో పాటు ఆయన బంధువులు, సన్నిహితులకు చెందిన సుమారు 15 ప్రాంతాల్లో ఏకకాలంలో సోదాలు నిర్వహించారు. హైదరాబాద్‌లోని హఫీజ్‌పేట, సూర్యాపేట, నల్గొండ జిల్లాల్లో ఈ తనిఖీలు జరిగాయి. ఈ సోదాల్లో రూ.5.92 కోట్ల విలువైన ఆస్తులకు సంబంధించిన పత్రాలను గుర్తించినట్లు ఏసీబీ అధికారులు అధికారికంగా ప్రకటించారు. స్వాధీనం చేసుకున్న ఆస్తుల్లో 27.29 ఎకరాల వ్యవసాయ భూమి, హైదరాబాద్‌లో రెండు ఇళ్లు, ఐదు ఓపెన్ ప్లాట్లు, ఒక వాణిజ్య భవనం ఉన్నాయి. వీటితో పాటు రూ.3.83 లక్షల నగదు, కిలో బంగారం, రెండు కార్లను కూడా గుర్తించారు. ఈ ఆస్తుల డాక్యుమెంట్ విలువ రూ.5.92 కోట్లుగా ఉన్నప్పటికీ, బహిరంగ మార్కెట్‌లో వీటి విలువ రూ.100 కోట్లకు పైగా ఉంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు. భుజంగరావు ఇంట్లో 29 మద్యం సీసాలు లభించడంతో, ఆ విషయాన్ని ఎక్సైజ్ శాఖకు నివేదించినట్లు ఏసీబీ తెలిపింది. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రాజకీయ నాయకులు, వ్యాపారవేత్తలు, ఇతర ప్రముఖుల ఫోన్లను అక్రమంగా ట్యాపింగ్ చేశారన్న ఆరోపణలపై నమోదైన కేసులో భుజంగరావు నిందితుడిగా ఉన్నారు. ఈ కేసులో ఆయనను 2024 మార్చిలో అరెస్ట్ చేయగా, తర్వాత తెలంగాణ హైకోర్టు బెయిల్ మంజూరు చేసింది.

# షావోమీ 17టీ వచ్చేసింది!

**ప్రారంభ ధర రూ.59,999.. లైకా 5ఎక్స్ పెరిస్కోప్ కెమెరా ప్రత్యేకత**




న్యూఢిల్లీ: ప్రముఖ స్మార్ట్‌ఫోన్ బ్రాండ్ షావోమీ తన సరికొత్త మోడల్ 'షావోమీ 17టీ' ఫోన్‌ను భారత మార్కెట్లో విడుదల చేసింది. ప్రసిద్ధ లైకా కెమెరా సిస్టమ్‌తో వస్తున్న ఈ ప్రీమియం ఫోన్ ప్రారంభ ధరను రూ.59,999గా సంస్థ నిర్ణయించింది. జూన్ 10వ తేదీ మధ్యాహ్నం 12 గంటల నుంచి అమెజాన్, ఎంఐ అధికారిక వెబ్‌సైట్, షావోమీ రిటైల్ స్టోర్లలో దీని అమ్మకాలు ప్రారంభం కానున్నాయి. ఇందులో 12జీబీ ర్యామ్ ప్లస్ 256జీబీ స్టోరేజ్, అలాగే 12జీబీ ర్యామ్ ప్లస్ 512జీబీ స్టోరేజ్ అనే రెండు వేరియంట్లు ఉన్నాయి. టాప్ వేరియంట్ ధర రూ.64,999. బ్యాంక్ ఆఫర్ల ద్వారా కొనుగోలుదారులకు రూ.5,000 ఇన్‌స్టంట్ డిస్కౌంట్ లభించనుంది. దీంతో ఈ ఫోన్ రూ.54,999కే లభిస్తుంది. ఈ స్మార్ట్‌ఫోన్ ప్రధాన ఆకర్షణ దీని కెమెరా అనే చెప్పాలి. లైకాతో కలిసి సంయుక్తంగా రూపొందించిన ట్రిపుల్ కెమెరా సెటప్‌ను ఇందులో అమర్చారు. దీని వెనుక భాగంలో ఓఐఎస్ సదుపాయం గల 50 మెగాపిక్సెల్ ప్రధాన కెమెరాతో పాటు, 5ఎక్స్ పెరిస్కోప్ టెలిఫొటో లెన్స్‌ను కూడా ఇచ్చారు. షావోమీ టీ-సిరీస్ ఫోన్లలో ఇలాంటి అడ్వాన్స్‌డ్ జూమ్ హార్డ్‌వేర్ ఇవ్వడం ఇదే మొదటిసారి. ఫొటో తీసే ముందు సెకన్ల కాలాన్ని కూడా రికార్డ్ చేసే 'లైకా లైవ్ మూమెంట్', అలాగే అద్భుతమైన పోర్ట్రెయిట్ ఫొటోల కోసం 'లైకా లైవ్ పోర్ట్రెయిట్' అనే రెండు కొత్త మోడ్‌లను ఇందులో పరిచయం చేశారు. ఈ ఫోన్‌లో 6.59 అంగుళాల 1.5కే అమోలెడ్ డిస్‌ప్లేను ఇచ్చారు. ఇది 120హెర్ట్జ్ రిఫ్రెష్ రేట్, 3500 నిట్స్ గరిష్ఠ బ్రైట్‌నెస్‌తో పనిచేస్తుంది. కళ్లకు రక్షణగా ఉండేలా ఈ స్క్రీన్‌కు టీయూవీ రైన్‌లాండ్ ఐ-కేర్ సర్టిఫికేషన్ ఉంది. ఫోన్ ఎక్కువ సమయం పనిచేసేందుకు వీలుగా ఇందులో 650ఎమ్ఏహెచ్ సిలికాన్-కార్బన్ బ్యాటరీని అమర్చారు. దీనితోపాటు 67 వాట్ల హైపర్‌ఛార్జ్ ఫాస్ట్ ఛార్జింగ్ సదుపాయం కూడా ఉంది. ఈ స్మార్ట్‌ఫోన్ సరికొత్త షావోమీ హైపర్ఓఎస్‌తో పనిచేస్తుంది. ఇందులో గూగుల్ జెమినీ, సర్కిల్ టు సెర్చ్, షావోమీ హైపర్ ఏఐ వంటి అత్యాధునిక ఫీచర్లు ఇన్-బిల్ట్‌గా వస్తున్నాయి. ఈ ఫోన్ వయొలెట్, బ్లూ, బ్లాక్ రంగుల్లో లభిస్తుంది. లాంచ్ ఆఫర్లలో భాగంగా క్రెడిట్ కార్డ్ ఈఎంఐ లావాదేవీలపై రూ.5,000 ముందస్తు బ్యాంక్ డిస్కౌంట్ ఉంటుంది. లేదా దీనికి బదులుగా రూ.5,000 ఎక్స్ఛేంజ్ బోనస్‌ను కూడా ఎంచుకోవచ్చు. అయితే ఈ రెండు ఆఫర్లను ఒకేసారి క్లబ్ చేయడానికి వీల్లేదు. కొత్త ఫోన్ కొన్నవారికి ఒక సంవత్సరం పాటు 60 శాతం వరకు అష్యూర్డ్ బైబ్యాక్ గ్యారెంటీ లభిస్తుంది. దీంతో పాటు గూగుల్ ఏఐ ప్రో, యూట్యూబ్ ప్రీమియం, జియోహాట్‌స్టార్, స్పోటిఫై ప్రీమియం వంటి యాప్‌ల మూడు నుంచి నాలుగు నెలల ఉచిత ట్రయల్స్ ఇస్తున్నారు. అలాగే గూగుల్ జెమినీ ప్రో ద్వారా 5000జీబీ క్లౌడ్ స్టోరేజ్ కూడా ఉచితంగా లభించనుంది.

# ఇస్లాంలోకి మారాలని వేధించారు

**పుణే విప్రోలో మాజీ ఉద్యోగిని ఆరోపణలు**

**బలవంతంగా రాజీనామా చేయించారని వెల్లడి**

పుణే: ప్రముఖ ఐటీ సంస్థ విప్రోలో మతపరమైన వేధింపుల ఆరోపణలు కలకలం రేపుతున్నాయి. పుణేలోని హింజేవాడి క్యాంపస్‌లో పనిచేసిన ఓ మాజీ మహిళా ఉద్యోగిని, తన సీనియర్ అధికారిణి ఒకరు తనను ఇస్లాం మతంలోకి మారాలంటూ తీవ్రంగా ఒత్తిడి చేశారని, వేధించారని పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ వేధింపుల కారణంగానే తాను 2025 ఆగస్టులో ఉద్యోగానికి రాజీనామా చేయాల్సి వచ్చిందని ఆరోపించారు. బాధితురాలు పుణెలో హిందూ జనజాగృతి సమితి నిర్వహించిన మీడియా సమావేశంలో తన ఆవేదనను వెల్లడించారు. 2019 నుంచి 2025 వరకు విప్రోలో పనిచేసిన తనపై, ఓ సీనియర్ సహోద్యోగి మత మార్పిడికి ఒత్తిడి తెచ్చారని ఆమె ఆరోపించారు. హిందూ మతాన్ని విడిచి ఇస్లాం స్వీకరిస్తే 'మెరుగైన జీవితం', విదేశాల్లో అవకాశాలు వస్తాయని నమ్మబలికారని, ఓ ముస్లిం వ్యక్తితో సంబంధం కూడా సూచించారని ఆమె తెలిపారు. ఈ ప్రతిపాదనలను వ్యతిరేకించడంతో కార్యాలయంలో వేధింపులు ఎక్కువయ్యాయని, పనితీరుపై నెగెటివ్ రిపోర్ట్ ఇస్తామని బెదిరించారని బాధితురాలు పేర్కొన్నారు. చివరికి తనతో బలవంతంగా రాజీనామా చేయించారని వాపోయారు. ఈ విషయంపై హెచ్ఆర్, యాజమాన్యానికి ఫిర్యాదు చేసినా వారు పట్టించుకోకపోగా, తనపైనే ఎదురు ఫిర్యాదు చేశారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం నిందితురాలు బెంగళూరులో పనిచేస్తున్నట్లు తెలిసింది. ఈ ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్లు పుణే పోలీసులు తెలిపారు. సీనియర్ అధికారి బాలాజీ పంధారే మాట్లాడుతూ, దర్యాప్తు ప్రారంభించామని, కంపెనీ రికార్డులను పరిశీలిస్తున్నామని చెప్పారు. మరోవైపు విప్రో యాజమాన్యం ఈ ఘటనపై స్పందిస్తూ, వేధింపుల పట్ల తమ సంస్థ జీరో-టాలరెన్స్ విధానాన్ని పాటిస్తుందని, పోలీసుల విచారణకు పూర్తిగా సహకరిస్తున్నామని ఒక ప్రకటనలో తెలిపింది. బాధితురాలు తనను తిరిగి ఉద్యోగంలోకి తీసుకోవాలని, నష్టపరిహారం చెల్లించాలని కోరుతూ కంపెనీకి లీగల్ నోటీసు కూడా పంపారు.

# ఒకే కుటుంబంలో 8 మంది ఆహుతి

**ఢిల్లీ అగ్నిప్రమాద ఘటనలో గగుర్పొడిచే అంశాలు**

**అనారోగ్యంతో ఉన్న తండ్రి కోసం వచ్చిన ఫ్యామిలీ**

**ఆసుపత్రికి దగ్గరగా ఉంటుందని హోటల్‌లో బస**



న్యూఢిల్లీ: ఢిల్లీలోని మాలవీయనగర్‌లో జరిగిన ఘోర అగ్నిప్రమాదం ఓ కుటుంబంలో తీరని చీకట్లను నింపింది. సాకేత్‌లోని మ్యాక్స్ ఆసుపత్రిలో ఊపిరితిత్తుల వ్యాధితో చికిత్స పొందుతున్న వృద్ధుడు రాధేశ్యామ్ అగర్వాల్‌ను చూసేందుకు గురుగ్రామ్ నుంచి ఆయన కుటుంబ సభ్యులు వచ్చారు. ఆసుపత్రికి దగ్గరగా ఉంటుందని భావించి స్థానికంగా ఉన్న 'ఫ్లరిష్ స్టే' అనే హోటల్‌లో దిగారు. కానీ ఊహించని విధంగా హోటల్‌లో చెలరేగిన మంటలు వారి జీవితాలను బుడిద చేశాయి. ఈ ప్రమాదంలో మొత్తం 21 మంది చనిపోగా వారిలో రాధేశ్యామ్ కుటుంబానికి చెందిన ఎనిమిది మంది ఉండటం అందరినీ కలచివేస్తోంది. గురుగ్రామ్ సెక్టార్-46కు చెందిన వివేక్ అగర్వాల్ (48) తన తండ్రికి తోడుగా ఉండేందుకు భార్య తార్జిని, కుమార్తెలు జివిషా, వార్యలతో కలిసి వచ్చారు. వీరితో పాటు కుటుంబ పెద్దలు అశోక్ అగర్వాల్, కమల, ప్రేమ్‌లత, ఝవేరి కూడా అక్కడే బస చేశారు. అలాగే రాధేశ్యామ్‌ను పరామర్శించేందుకు తార్జిని మేనమామ అజయ్ గుప్తా వైపు బంధువులు మరో ముగ్గురు కూడా ఆ హోటల్‌కే వచ్చారు. ఒకే కుటుంబానికి చెందిన రెండు తరాల వారు ఇలా హోటల్ గదుల్లో ఉన్న సమయంలోనే మృత్యువు అగ్ని రూపంలో ముంచెత్తింది. ఈ ప్రమాదంలో రాధేశ్యామ్ భార్య, కుమారుడు, కోడలు, ఇద్దరు మనవరాళ్లతో పాటు ముగ్గురు బంధువులు కూడా తనువు చాలించారు. ఆసుపత్రిలో చావుబతుకుల మధ్య పోరాడుతున్న ఆ వృద్ధుడికి, తన కుటుంబం మొత్తం ఇక లేదనే చేదు నిజం ఇంకా తెలియదు. బంధువులంతా మ్యాక్స్ ఆసుపత్రి వద్దకు చేరుకుని కన్నీరుమున్నీరుగా విలపిస్తున్న దృశ్యాలు అక్కడ ఉన్న వారిని కదిలించాయి.

# విపణిలోకి కొత్త ఇన్నోవా క్రిస్టా

**ప్రారంభ ధర రూ. 19.72 లక్షలు.. వేరియంట్‌ను బట్టి రూ.83,000 అదనం**




న్యూఢిల్లీ: ప్రముఖ ఆటోమొబైల్ సంస్థ టయోటా కిర్లోస్కర్ మోటార్, భారత మార్కెట్లోకి సరికొత్త 2026 ఇన్నోవా క్రిస్టా ఎంపీవీని విడుదల చేసింది. స్వల్ప కాస్మెటిక్, ఫీచర్ అప్‌డేట్లతో వచ్చిన ఈ కొత్త వెర్షన్ ధరలు రూ. 19.72 లక్షల నుంచి రూ. 26.63 లక్షల (ఎక్స్-షోరూమ్) వరకు ఉన్నాయి. ఇప్పటికే దేశవ్యాప్తంగా ఉన్న టయోటా డీలర్‌షిప్‌లలో బుకింగ్స్ ప్రారంభమయ్యాయి. కొత్త ఇన్నోవా క్రిస్టాలో ముందు, వెనుక బంపర్లపై కొత్త క్రోమ్ గార్నిష్, అప్‌డేట్ చేసిన గ్రిల్ డిజైన్‌ను అందించారు. ఇంటీరియర్‌లో డ్యూయల్-టోన్ సీట్ అపోల్ట్రీ, స్టీరింగ్ వీల్, డోర్ ట్రిమ్‌లపై గ్రేస్ కాపర్ యాక్సెంట్స్ వంటి మార్పులు చేశారు. టాప్ వేరియంట్లయిన వీఎక్స్, జెడ్ఎక్స్‌లలో వైర్‌లెస్ ఛార్జర్, జెడ్ఎక్స్ ట్రిమ్‌లో టైర్-ప్రెజర్ మానిటరింగ్ సిస్టమ్ వంటి కొత్త ఫీచర్లను జోడించారు. అయితే, ఇంజిన్‌లో ఎలాంటి మార్పులు చేయలేదు. పాత మోడల్‌లో ఉన్న 2.4-లీటర్ డీజిల్ ఇంజిన్‌నే కొనసాగించారు. ఇది 150 హెచ్‌పీ పవర్, 343 ఎన్ఎమ్ టార్క్‌ను ఉత్పత్తి చేస్తుంది. 5-స్పీడ్ మ్యాన్యువల్ ట్రాన్స్‌మిషన్‌తో ఇది లభిస్తుంది. ఎకో, పవర్ డ్రైవ్ మోడ్‌లు కూడా యథావిధిగా ఉన్నాయి. పాత మోడల్‌తో పోలిస్తే, కొత్త క్రిస్టా ధరలు వేరియంట్‌ను బట్టి రూ. 32,000 నుంచి రూ. 83,000 వరకు పెరిగాయి. భద్రత పరంగా ఏబీఎస్ విత్ ఈబీడీ, హిల్-స్టార్ట్ అసిస్ట్, 3 ఎయిర్‌బ్యాగ్‌లు బేస్ వేరియంట్లలో స్టాండర్డ్‌గా వస్తుండగా, హై-ఎండ్ వేరియంట్లలో 7 ఎయిర్‌బ్యాగ్‌ల వరకు ఉన్నాయి. 2016లో విడుదలైనప్పటి నుంచి ఇన్నోవా క్రిస్టా తన విశ్వసనీయత, విశాలమైన స్థలం, మన్నికతో ప్రైవేట్, ఫ్లీట్ ఆపరేటర్లలో మంచి ప్రజాదరణ పొందింది.

# కాక్రోచ్ పార్టీ.. బ్యాలెట్ బాక్స్ కాదు!

**యువత ఆందోళనలు సమంజసమే**

**వ్యవస్థలో ఉంటూనే మార్పు కోసం పోరాడాలి**

**కాక్రోచ్ జనతా పార్టీపై శశిథరూర్**

న్యూఢిల్లీ: కాంగ్రెస్ ఎంపీ శశిథరూర్ యువతకు, ముఖ్యంగా జెన్-జీ తరానికి కీలక సందేశం ఇచ్చారు. సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న 'కాక్రోచ్ జనతా పార్టీ' (సీజేపీ) ఉద్యమాన్ని ఉద్దేశించి ఆయన 'ది ఇండియన్ ఎక్స్‌ప్రెస్' పత్రికలో వ్యాసం రాశారు. "ఇన్‌స్టాగ్రామ్ అనేది మీ అభిప్రాయాలను పంచుకునే ఒక వేదిక మాత్రమే. కానీ అది ఓటు వేసే బ్యాలెట్ బాక్స్ కాదు" అని స్పష్టం చేశారు. కేవలం సోషల్ మీడియా నిరసనలతోనే మార్పు రాదని, వ్యవస్థలో భాగస్వాములు కావడం ద్వారానే శాశ్వత మార్పు సాధ్యమవుతుందని యువతకు హితవు పలికారు. పేపర్ లీక్‌లు, పరీక్షల నిర్వహణలో వైఫల్యాల వల్ల



యువత ఎదుర్కొంటున్న నిరాశ, కోపం చాలా సమంజసమైనవని థరూర్ అభిప్రాయపడ్డారు. అయితే ఆ కోపాన్ని కేవలం ఆన్‌లైన్ హేళనలకే పరిమితం చేయకుండా చట్టపరమైన, ప్రజాస్వామ్య మార్గాల్లో ఉపయోగించాలని సూచించారు. సమాచార హక్కు చట్టం ద్వారా ప్రశ్నించడం, ప్రజాప్రతినిధులను నిలదీయడం వంటి పనుల ద్వారా వ్యవస్థలో పారదర్శకతను తీసుకురావచ్చని సూచించారు. నిర్దిష్టమైన డిమాండ్లతో పోరాడినప్పుడే మీడియా కూడా సమస్యలతో పాటు పరిష్కారాలను చూపిస్తుందని పేర్కొన్నారు. యువత తమ నిరసనను కేవలం నినాదాలకే పరిమితం చేయకుండా పద్ధతి ప్రకారం ముందుకు తీసుకెళ్లాలని థరూర్ పిలుపునిచ్చారు. విద్యార్థి సంఘాలు, న్యాయ నిపుణులు, పాలసీ సంస్థలతో కలిసి పనిచేసి గట్టిగా లాబీయింగ్ చేయాలన్నారు. "మీ కోపం నిరాశగా మారిపోనివ్వకండి. మీ సంఖ్యా బలం, డిజిటల్ పరిజ్ఞానంతో దీర్ఘకాలిక మార్పు కోసం పోరాడండి" అని ఆయన ముగించారు. నిరుద్యోగం, పరీక్షల వివాదాలపై అభిజిత్ దిప్కే అనే యువకుడు సోషల్ మీడియాలో సరదాగా ప్రారంభించిన ఈ 'కాక్రోచ్ జనతా పార్టీ' ఉద్యమం ప్రస్తుతం దేశవ్యాప్తంగా మిలియన్ల మంది యువతను ఆకర్షిస్తోంది.

# బీజేపీ వైపు 20 మంది టీఎంసీ ఎంపీలు!

**అభిషేక్ బెనర్జీపై అసంతృప్తితోనే తిరుగుబాటు.. బెంగాల్‌లో పార్టీ కమిటీలన్నింటినీ రద్దు చేసిన టీఎంసీ**

కోల్‌కతా: పశ్చిమబెంగాల్‌లో తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) పార్టీ చరిత్రలోనే అతిపెద్ద సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి తర్వాత మొదలైన అసమ్మతి, ఇప్పుడు ఎమ్మెల్యేల తిరుగుబాటుతో తీవ్రస్థాయికి చేరింది. ఈ సంక్షోభం రాష్ట్రానికే పరిమితం కాకుండా, ఢిల్లీకి కూడా పాకింది. ఏకంగా 20 మంది లోక్‌సభ సభ్యులు పార్టీ మారేందుకు సిద్ధమవుతున్నారనే వార్తలు మమతా బెనర్జీకి కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. జూన్ 3న, పార్టీ నుంచి బహిష్కరణకు గురైన ఎమ్మెల్యే రితబ్రత బెనర్జీని ప్రతిపక్ష నేతగా అసెంబ్లీ స్పీకర్ రతీంద్ర బోస్ గుర్తించారు. తమకు 58 మంది ఎమ్మెల్యేల మద్దతు ఉందని రెబల్ వర్గం ప్రకటించింది. దీంతో అసెంబ్లీలో మమతా బెనర్జీ వర్గం బలహీనపడింది. మొత్తం 80 మంది టీఎంసీ ఎమ్మెల్యేలలో అధికశాతం మంది రెబల్ వర్గం వైపు ఉన్నారు. ఏప్రిల్-మే నెలలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో 15 ఏళ్ల టీఎంసీ పాలనకు తెరపడిన తర్వాత ఈ సంక్షోభం మొదలైంది. ప్రతిపక్ష నేత ఎంపిక విషయంలో పార్టీ అధిష్టానం తీసుకున్న నిర్ణయాన్ని




రెబల్ ఎమ్మెల్యేలు వ్యతిరేకించారు. మమతా బెనర్జీ మేనల్లుడు అభిషేక్ బెనర్జీ వ్యవహార శైలి, ఎన్నికల ఓటమి తర్వాత ఆయన పెత్తనం చెలాయించడమే ఈ తిరుగుబాటుకు ప్రధాన కారణంగా తెలుస్తోంది. తామంతా మమతా బెనర్జీ నాయకత్వాన్ని గౌరవిస్తామని, కానీ అభిషేక్ పెత్తనాన్ని సహించబోమని రెబల్ ఎమ్మెల్యేలు స్పష్టం చేస్తున్నారు. ఈ పరిణామాల నేపథ్యంలో, సుమారు 20 మంది టీఎంసీ ఎంపీలు బీజేపీ నాయకులతో సంప్రదింపులు జరుపుతున్నట్లు వార్తలు వస్తున్నాయి. ఇది నిజమైతే, పార్లమెంటులో మమతా బెనర్జీ బలం మరింత క్షీణిస్తుంది. ఇటీవల మమత నిర్వహించిన నిరసన కార్యక్రమానికి కేవలం ఆరుగురు ఎంపీలు, ఎనిమిది మంది ఎమ్మెల్యేలు మాత్రమే హాజరుకావడం ఆమె చుట్టూ విధేయుల సంఖ్య తగ్గుతోందనడానికి నిదర్శనంగా కనిపిస్తోంది. ఈ తిరుగుబాటు నేపథ్యంలో టీఎంసీ బెంగాల్‌లోని అన్ని కమిటీలను రద్దు చేసి, ఆత్మపరిశీలన చేసుకుంటామని ప్రకటించింది.

# ఆర్మీ కెప్టెన్ ప్రపోజల్.. చర్చ రచ్చ!



న్యూఢిల్లీ: భారత సైన్యంలో కొత్తగా శిక్షణ పూర్తి చేసుకున్న ఓ పైలట్, తన కాబోయే భార్యకు చేసిన పెళ్లి ప్రపోజల్ ఇప్పుడు సోషల్ మీడియాలో పెద్ద చర్చకు దారితీసింది. సైనిక క్రమశిక్షణ, వ్యక్తిగత భావప్రకటన మధ్య సరిహద్దులపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్న వేళ, పలువురు ఆర్మీ మాజీ ఉన్నతాధికారులు ఆ యువ కెప్టెన్‌కు అండగా నిలిచారు. వివరాల్లోకి వెళితే, నాసిక్‌లోని కంబాట్ ఆర్మీ ఏవియేషన్ ట్రైనింగ్ స్కూల్‌లో జూన్ 2న పాసింగ్ ఔట్ పరేడ్ జరిగింది. ఈ కార్యక్రమంలో శిక్షణ పూర్తి చేసుకున్న కెప్టెన్ భరత్ భరద్వాజ్, తన యూనిఫామ్‌లోనే ఎయిర్‌ఫీల్డ్‌లో నిలిపి ఉన్న చీతా హెలికాప్టర్ పక్కన మోకాళ్లపై కూర్చుని, తన కాబోయే భార్య ఆరుషికి ఉంగరం తొడిగి ప్రపోజ్ చేశారు. ఈ దృశ్యాన్ని అక్కడున్న తోటి అధికారులు, కుటుంబ సభ్యులు చప్పట్లతో అభినందించారు. ఈ వీడియో వేగంగా వైరల్ అయింది. అయితే, సైనిక ప్రాంగణాన్ని, ఆస్తులను వ్యక్తిగత కార్యక్రమానికి ఉపయోగించుకోవడం నిబంధనల ఉల్లంఘన కిందికి వస్తుందంటూ కొందరు విమర్శలు చేశారు. ఈ ఘటనపై భారత సైన్యం దృష్టి సారించిందని, కెప్టెన్ భరద్వాజ్‌ను వివరణ కోరిందని వార్తలు వచ్చాయి. షోకాజ్ నోటీసు ఇచ్చే అవకాశం ఉందని కూడా ప్రచారం జరిగింది. అయితే, వివాదం నేపథ్యంలో, పలువురు ఆర్మీ మాజీ ఉన్నతాధికారులు కెప్టెన్ భరత్‌కు మద్దతుగా నిలిచారు. ఇది క్రమశిక్షణ ఉల్లంఘన కాదని, కేవలం స్వచ్ఛమైన ప్రేమపూర్వక చర్య అని స్పష్టం చేశారు. నార్తర్న్ ఆర్మీ మాజీ కమాండర్, లెఫ్టినెంట్ జనరల్ కేజేఎస్ ధిల్లాన్ (రిటైర్డ్) ఈ విషయంపై గట్టిగా స్పందించారు. "దేశం కోసం ఓ యువ అధికారి ప్రాణత్యాగం చేయాలని మీరు కోరుకుంటారు, కానీ అతను తన కాబోయే భార్యపై ప్రేమను చూపించడాన్ని మాత్రం వ్యతిరేకిస్తారా?" అని ఆయన ప్రశ్నించారు. "యువత చేయకపోతే ఇంకెవరు చేస్తారు?" అంటూ, ఈ ప్రేమపూర్వక చర్యను అనవసరంగా విమర్శించవద్దని హితవు పలికారు. మరో మాజీ అధికారి, లెఫ్టినెంట్ జనరల్ సతీశ్ దువా (రిటైర్డ్) కూడా ఇన్‌స్టాగ్రామ్‌లో స్పందిస్తూ, ఇందులో ఎలాంటి భద్రతా ఉల్లంఘన జరగలేదని అన్నారు. సైనికులు కుటుంబానికి, స్నేహితులకు దూరంగా ఎన్నో త్యాగాలు చేస్తారని, వారిని ప్రశాంతంగా ఉండనివ్వాలని కోరారు. కల్నల్ ఏజే రైనా (రిటైర్డ్) స్పందిస్తూ, ఈ చిన్న ప్రపోజల్‌ను జాతీయ భద్రతా సమస్యగా చిత్రీకరిస్తున్న సోషల్ మీడియా విమర్శకులను ఎద్దేవా చేశారు. ఒకవేళ ఏవైనా నిబంధనల ఉల్లంఘనలు ఉంటే, వాటిని సైన్యం అంతర్గతంగా చూసుకుంటుందని ఆయన అభిప్రాయపడ్డారు.



# మమతా బెనర్జీపై కేసు నమోదు!

సిలిగురి: పశ్చిమ బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి మమతా బెనర్జీపై సిలిగురి సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్‌లో ఎఫ్ఐఆర్ నమోదైంది. కేంద్ర హోం మంత్రిత్వ శాఖ, హోం మంత్రి అమిత్ షాపై ఆమె వివాదాస్పద వ్యాఖ్యలు చేసినట్లు ఆరోపణలు వచ్చాయి. ఓ న్యాయవాది ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా పోలీసులు ఈ కేసు నమోదు చేశారు. జూన్ 2న కోల్‌కతాలో జరిగిన నిరసన సభలో మమతా బెనర్జీ మాట్లాడుతూ.. బంగ్లాదేశ్ జాతీయుడు ఉస్మాన్ హాది హత్య గురించి ప్రస్తావించారు. ఆ హత్య వెనుక కేంద్ర హోం శాఖ ప్రమేయం ఉందనేలా ఆమె సంచలన ఆరోపణలు చేశారు. ఈ వ్యాఖ్యలపై లాయర్ రింకీ సేన్ ఛటర్జీ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. గత డిసెంబర్‌లో బంగ్లాదేశ్‌లో ఉస్మాన్ హాది హత్య జరిగిందని ఆమె పేర్కొన్నారు. ఆ హంతకులు మేఘాలయ సరిహద్దు దాటి బెంగాల్‌లోకి రాగా రాష్ట్ర ఎస్టీఎఫ్ పోలీసులు అరెస్ట్ చేశారని గుర్తు చేశారు. అయితే ఈ హత్య కేంద్ర హోం శాఖ ఆదేశాల మేరకే జరిగిందని మమతా బెనర్జీ ఆరోపించడం సరికాదన్నారు. ఇలాంటి వ్యాఖ్యల వల్ల భారత్, బంగ్లాదేశ్ మధ్య ఉద్రిక్తతలు పెరుగుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. దీదీ వ్యాఖ్యలు అంతర్జాతీయంగా దేశ ప్రతిష్ఠను దిగజార్చేలా ఉన్నాయని ఫిర్యాదులో పేర్కొన్నారు. బంగ్లాదేశ్‌లో ఉండే హిందువుల భద్రతను కూడా ఇవి ప్రమాదంలో పడేస్తాయని ఆందోళన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రిగా పనిచేసిన వ్యక్తి రెచ్చగొట్టేలా మాట్లాడటం చట్టవిరుద్ధమని అన్నారు. ఈ ఫిర్యాదును స్వీకరించిన పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

# ఫ్లాట్‌గా మార్కెట్లు

ముంబై: రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) మానిటరీ పాలసీ కమిటీ (ఎంపీసీ) సమావేశం నేపథ్యంలో ఇన్వెస్టర్లు అప్రమత్తంగా వ్యవహరించడంతో దేశీయ స్టాక్ మార్కెట్లు గురువారం ఫ్లాట్‌గా ముగిశాయి. రోజంతా పరిమిత శ్రేణిలో కదలాడిన సూచీలు చివరకు స్వల్ప లాభాలతో సరిపెట్టుకున్నాయి. ట్రేడింగ్ ముగిసే సమయానికి నిఫ్టీ 10.95 పాయింట్లు లాభపడి 23,416.55 వద్ద స్థిరపడింది. సెన్సెక్స్ కూడా కేవలం 13.84 పాయింట్ల స్వల్ప లాభంతో 74,360.01 వద్ద ముగిసింది. శుక్రవారం ఆర్బీఐ పాలసీ నిర్ణయాలు వెలువడనున్న తరుణంలో, ఇన్వెస్టర్లు పెద్ద ఎత్తున కొనుగోళ్లకు దూరంగా ఉన్నారు. టెక్నికల్ పరంగా, నిఫ్టీకి 23,500 స్థాయి కీలక నిర్ణయాత్మక జోన్‌గా ఉందని నిపుణులు విశ్లేషిస్తున్నారు. ఈ స్థాయిని దాటితే మార్కెట్ సెంటిమెంట్ మెరుగుపడి 23,600, ఆ తర్వాత 23,800 వైపు పయనించవచ్చని అంచనా వేస్తున్నారు. మరోవైపు, 23,300-23,350 వద్ద తక్షణ మద్దతు లభిస్తుండగా, 23,150-23,200 వద్ద బలమైన కొనుగోళ్ల ఆసక్తి కనిపిస్తోందని తెలిపారు. ఈరోజు సెషన్‌లో ఇన్ఫోసిస్, బజాజ్ ఫిన్‌సర్వ్, హిందాల్కో వంటి ప్రధాన షేర్లలో అమ్మకాల ఒత్తిడి సూచీలపై ప్రభావం చూపింది. రంగాలవారీగా నిఫ్టీ ఐటీ, మెటల్, కెమికల్ సూచీలు నష్టపోగా, నిఫ్టీ కన్స్యూమర్ డ్యూరబుల్స్, మీడియా రంగాల్లో కొనుగోళ్ల ఉత్సాహం కనిపించింది. అయితే, బ్రాడర్ మార్కెట్లలో సానుకూలత కనిపించింది. నిఫ్టీ మిడ్‌క్యాప్ 0.46 శాతం, స్మాల్‌క్యాప్ 0.49 శాతం లాభపడ్డాయి. ప్రస్తుతం మార్కెట్ వర్గాలన్నీ ఆర్బీఐ సమావేశం ఫలితాల కోసం ఎదురుచూస్తున్నాయి. వడ్డీ రేట్లు, ద్రవ్య లభ్యతపై రాబోయే సంకేతాలు సమీప భవిష్యత్తులో మార్కెట్ గతిని నిర్దేశించే అవకాశం ఉంది.

# దేశంలో ఆర్థిక సునామీ తప్పదు

**కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ**

**భయాన్ని సృష్టించవద్దని బీజేపీ హెచ్చరిక**

న్యూఢిల్లీ: దేశంలో త్వరలో 'ఆర్థిక సునామీ' రాబోతోందని, ప్రభుత్వం ఎమర్జెన్సీ తరహా పరిస్థితులను ప్రకటించవచ్చని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలను బీజేపీ తీవ్రంగా ఖండించింది. ఇవి కేవలం ప్రజల్లో భయాన్ని సృష్టించే ప్రయత్నాలని, భారత ఆర్థిక వ్యవస్థ ప్రపంచ సవాళ్లను తట్టుకుని పటిష్ఠంగా ఉందని స్పష్టం చేసింది. బుధవారం కాంగ్రెస్ గిరిజన విభాగం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రాహుల్ గాంధీ మాట్లాడుతూ, దేశంలో ధరలు విపరీతంగా పెరుగుతున్నాయని, తీవ్రమైన ఆర్థిక సంక్షోభం తప్పదని హెచ్చరించారు. గతంలో ఆర్థిక ఒత్తిళ్ల నుంచి దేశాన్ని కాపాడిన వ్యవస్థలను ప్రభుత్వం నిర్వీర్యం చేసిందని ఆరోపించారు. ప్రజా వ్యతిరేకతను అణచివేసేందుకు ప్రభుత్వం ఎమర్జెన్సీ విధించే అవకాశం ఉందని కూడా ఆయన వ్యాఖ్యానించారు. రాహుల్ ఆరోపణలపై బీజేపీ ఐటీ సెల్ చీఫ్ అమిత్ మాలవీయ సామాజిక మాధ్యమ వేదికగా స్పందించారు. రాహుల్ వ్యాఖ్యలు తప్పు మాత్రమే కాదు, ఇది కచ్చితంగా భయాన్ని వ్యాప్తి చేయడమేనని విమర్శించారు. గత దశాబ్ద కాలంలో ఆర్థిక రక్షణ వ్యవస్థలను బలోపేతం చేశామని పేర్కొన్నారు. పెరుగుతున్న విద్యుత్ వినియోగం, వాహన అమ్మకాలు, ద్రవ్యోల్బణం అదుపులో ఉండటం, భారీ విదేశీ మారక నిల్వలు వంటివి ఆర్థిక పటిష్టతకు నిదర్శనమని పేర్కొన్నారు. సునామీ 2013లో వచ్చిందని, ఇప్పుడు కాదని వ్యంగ్యంగా అన్నారు.



## పెద్దమ్మ తల్లి బోనాల్లో దావ వసంత

జగిత్యాల రూరల్, జూన్ 4 (ఈవార్తలు): జగిత్యాల రూరల్ మండలం మొరపెల్లి గ్రామంలో నిర్వహించిన పెద్దమ్మ తల్లి బోనాల ఉత్సవాల్లో జిల్లా తొలి జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత సురేష్ పాల్గొన్నారు. మహిళలతో కలిసి బోనం సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బీఆర్ఎస్ హయాంలో మిషన్ కాకతీయ ద్వారా చెరువుల పునరుద్ధరణతో పాటు ముదిరాజుల అభివృద్ధికి కృషి చేశామన్నారు. చేపల మార్కెటింగ్ కోసం సబ్సిడీపై వాహనాలు అందించామని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో ఏ వర్గం కూడా సంతృప్తిగా లేదని విమర్శించారు. అనంతరం మొరపెల్లి జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను సన్మానించారు. కార్యక్రమంలో పాక్స్ చైర్మన్ మహిపాల్ రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు, మహిళలు, భక్తులు పాల్గొన్నారు.



## జగిత్యాల రోడ్ల అభివృద్ధికి నిధులివ్వండి

**ఆర్అండ్‌బీ అధికారులను కలిసిన ఎమ్మెల్యే**

జగిత్యాల, జూన్ 4 (ఈవార్తలు): జగిత్యాల నియోజకవర్గంలో రహదారుల అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ రాష్ట్ర ఆర్అండ్‌బీ శాఖ చీఫ్ ఇంజనీర్ మోహన్ నాయక్, చీఫ్ ఇంజనీర్ హెచ్ఏఎం వెంకటేశ్వరరావును మర్యాదపూర్వకంగా కలిసి విజ్ఞప్తి చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర రోడ్లు-భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఆదేశాల మేరకు జగిత్యాల నియోజకవర్గంలో సుమారు రూ.65 కోట్లతో పలు అభివృద్ధి పనులకు తక్షణమే నిధులు మంజూరు చేయాలని అధికారులను కోరినట్లు తెలిపారు. దీనిపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించిందన్నారు. అలాగే జగిత్యాల నియోజకవర్గంలో దాదాపు రూ.100 కోట్లతో రహదారుల అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేసేందుకు ముఖ్యమంత్రి హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే సంజయ్ వెల్లడించారు. త్వరలోనే జగిత్యాల పట్టణంతో పాటు పరిసర గ్రామాల్లో వర్షాలతో దెబ్బతిన్న రోడ్లు, వంతెనల మరమ్మతులు, రోడ్ల విస్తరణ పనులు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు.




## టీ-ఫైబర్ బ్యాటరీల దొంగలు అరెస్ట్

**రూ.4.52 లక్షల సామగ్రి స్వాధీనం**

జగిత్యాల అర్బన్, జూన్ 4 (ఈవార్తలు): జగిత్యాల అర్బన్ పరిధిలోని ధరూర్ గ్రామ శివారులో టీ-ఫైబర్ బ్యాటరీల దొంగతనాలకు పాల్పడుతున్న ముగ్గురు వ్యక్తులను పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. వారి వద్ద నుంచి 39 బ్యాటరీలు, నాలుగు యూపీఎస్ పవర్ సప్లయర్లు, ఒక ఆటోను స్వాధీనం చేసుకున్నట్లు రూరల్ సీఐ సుధాకర్ తెలిపారు. అంబేద్కర్ చౌరస్తా వద్ద నిర్వహించిన వాహన తనిఖీల్లో టీజీ21టీ1774 నంబర్ గల ఆటోలో బ్యాటరీలు, యూపీఎస్ పరికరాలు గుర్తించి ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. విచారణలో వారు పలు గ్రామపంచాయతీ భవనాల్లో ఏర్పాటు చేసిన టీ-ఫైబర్ బ్యాటరీలు, యూపీఎస్ పరికరాలను దొంగిలించినట్లు ఒప్పుకున్నారని తెలిపారు. ప్రధాన నిందితుడు బండ అంజయ్య గతంలో టీ-ఫైబర్ అనుబంధ సంస్థలో పనిచేశాడని, అతనితో పాటు మండలి రవి, చేమెల్ల నరేశ్ కలిసి దొంగతనాలకు పాల్పడినట్లు వెల్లడించారు. స్వాధీనం చేసుకున్న వస్తువుల విలువ సుమారు రూ.4.52 లక్షలు ఉంటుందని తెలిపారు. ముగ్గురు నిందితులు లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన వారని సీఐ పేర్కొన్నారు.



## ఈవీఎం గోదాంలో కలెక్టర్ తనిఖీ

జగిత్యాల, జూన్ 4 (ఈవార్తలు): రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు గురువారం జగిత్యాల జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ బి. సత్యప్రసాద్ ధరూర్ క్యాంపులోని ఈవీఎంల గోదామును రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గోదాములో భద్రపరిచిన ఈవీఎంల భద్రతా ఏర్పాట్లు, సీసీ కెమెరాల పనితీరు, సాంకేతిక అంశాలను పరిశీలించారు. ప్రతినెలా ఈవీఎంలను తనిఖీ చేస్తున్నామని, గోదాము వద్ద ఎలాంటి లోపాలు లేకుండా పటిష్ట భద్రత కల్పించాలని సిబ్బందికి సూచించారు. నిరంతరం అప్రమత్తంగా ఉంటూ పర్యవేక్షణ కొనసాగించాలని ఆదేశించారు. తనిఖీలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బి.ఎస్. లత, జగిత్యాల ఆర్డీవో మధుసూదన్, జగిత్యాల అర్బన్ తహసీల్దార్ రామ్‌మోహన్, రాజకీయ పార్టీల నాయకులు జిల్లా డీసీసీ అధ్యక్షులు గాజెంగి. నందయ్య, బి ఆర్ ఎస్ పట్టణ అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# ఏసీబీ వలలో అటవీ అధికారి

**రూ.80 వేల లంచం తీసుకుంటూ దొరికిన కొడిమ్యాల రేంజర్**

కొడిమ్యాల, జూన్ 4 (ఈవార్తలు): జగిత్యాల జిల్లా కొడిమ్యాల అటవీ రేంజి అధికారి గులాం మొయినొద్దీన్‌ను అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు గురువారం లంచం తీసుకుంటుండగా రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. కొడిమ్యాల అటవీ రేంజి కార్యాలయంలో రూ.80 వేల లంచం స్వీకరిస్తున్న సమయంలో కరీంనగర్ ఏసీబీ యూనిట్ అధికారులు ఉచ్చు వేసి అదుపులోకి తీసుకున్నారు. ఏసీబీ తెలిపిన వివరాల ప్రకారం, హిమ్మత్రావుపేట గ్రామానికి చెందిన టింబర్ డిపో నిర్వాహకుడు రంజిత్ రావుకు చెందిన 120 తేకు చెట్ల నరికివేతకు అనుమతి మంజూరు చేయడంతో పాటు రవాణా పర్మిట్ జారీ చేయడానికి గులాం మొయినొద్దీన్ మొదట రూ.2 లక్షల లంచం డిమాండ్ చేశారు. ఇందులో భాగంగా ఫిర్యాదుదారు రంజిత్ రావు గత నెల మే 13న రూ.1 లక్ష నగదును అందజేసినట్లు తెలిసింది. అనంతరం అధికారిక పని పూర్తైన తర్వాత మిగిలిన లంచం మొత్తాన్ని రూ.80 వేలకు తగ్గించి, గురువారం కార్యాలయంలో స్వీకరిస్తుండగా ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. లంచం మొత్తాన్ని రేంజి అధికారి కూర్చున్న టేబుల్ డ్రాయర్‌లో ఉంచగా అక్కడి నుంచి నగదును స్వాధీనం చేసుకున్నారు. ఈ దాడిని ఏసీపీ/డీఎస్పీ విజయ్ కుమార్ ఆధ్వర్యంలో ముగ్గురు సీఐలతో కలిసి ఏసీబీ బృందం నిర్వహించింది. తన అధికార హోదాను దుర్వినియోగం చేస్తూ అక్రమ లాభం పొందినట్లు ప్రాథమిక విచారణలో తేలినట్లు అధికారులు తెలిపారు.

**డీఎఫ్‌వో పాత్రపై ఏసీబీ ఆరా**

కొడిమ్యాల అటవీ రేంజి అధికారి గులాం మోయినొద్దీన్ రూ.80 వేల లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు పట్టుబడిన కేసులో జిల్లా అటవీ అధికారి (డీఎఫ్‌వో) రవి ప్రసాద్ పాత్రపై అధికారులు ఆరా తీస్తున్నారు. ఈ మేరకు గురువారం జగిత్యాల అటవీ కార్యాలయంలో డీఎఫ్‌వోను ఏసీబీ అధికారులు విచారించారు. లంచం వ్యవహారంలో డీఎఫ్‌వోకు ఏమైనా సంబంధం ఉందా అనే కోణంలో దర్యాప్తు కొనసాగిస్తున్న అధికారులు, ఆయనకు చెందిన సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకుని పరిశీలన కోసం తీసుకున్నట్లు సమాచారం. రేంజి అధికారి లంచం స్వీకరించిన ఘటనకు సంబంధించి మరిన్ని వివరాలు సేకరిస్తున్నారు. ఇదే కేసులో ఏసీబీ అధికారులు కార్యాలయ పత్రాలు, డిజిటల్ ఆధారాలను కూడా పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. ఏసీబీ సీఐ పొన్నం చందర్ ఆధ్వర్యంలో విచారణ కొనసాగుతోంది.



# మోదీ, బండి చిత్రపటాలకు క్షీరాభిషేకాలు

**జగిత్యాలలో బీజేపీ నేతల కృతజ్ఞత**

జగిత్యాల, జూన్ 4 (ఈవార్తలు): తెలంగాణలో జాతీయ రహదారుల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం భారీగా నిధులు మంజూరు చేసిన సందర్భంగా జగిత్యాల బీజేపీ సీనియర్ నాయకుల ఆధ్వర్యంలో గురువారం స్థానిక తహసీల్ చౌరస్తా వద్ద ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ తెలంగాణ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తూ రహదారుల నిర్మాణానికి వేల కోట్ల రూపాయల నిధులు కేటాయించడం అభినందనీయమన్నారు. జగిత్యాల ప్రాంతానికి సంబంధించిన రహదారి ప్రాజెక్టులకు ఆమోదం లభించడం వల్ల ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు అందడంతో పాటు ఆర్థికాభివృద్ధికి దోహదపడుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు ఏసీఎస్ రాజు, సిపెల్లి రవీందర్, కౌన్సిలర్ అరవ లక్ష్మి, నరెందుల శ్రీనివాస్, అంకర్ సుధాకర్, చీటీ శేఖర్‌రావు, లింగాల శ్రీకాంత్‌రావు, ఠాకూర్ కిషోర్‌సింగ్, ఎడమల వెంకట్‌రెడ్డి, ఠాకూర్ విద్యాసింగ్, పోరండ్ల భిక్షపతి, గోదిశేల నాగరాజు, ఎండీ సుమీర్, కుర్మచలం సతీష్, కస్తూరి రాజు, బలేటి ఎర్ర శ్రీనివాస్, బిట్టు తదితరులు పాల్గొన్నారు.



# 'అమరావతి ఐ'కి గ్రీన్ సిగ్నల్

**కీలక ప్రతిపాదనలకు ఏపీ కేబినెట్ పచ్చజెండా**

అమరావతి, జూన్ 4 (ఈవార్తలు): ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన గురువారం జరిగిన ఆంధ్రప్రదేశ్ మంత్రివర్గ సమావేశం, రాష్ట్ర సమగ్రాభివృద్ధికి బాటలు వేసే పలు చారిత్రాత్మక నిర్ణయాలకు ఆమోదం తెలిపింది. రాజధాని అమరావతికి అంతర్జాతీయ గుర్తింపు తెచ్చే 'అమరావతి ఐ' ప్రాజెక్టు నుంచి గ్రామీణ పేదల బతుకులకు భరోసా ఇచ్చే కొత్త ఉపాధి హామీ పథకం వరకు దాదాపు 35కు పైగా కీలక అంశాలపై కేబినెట్ సుదీర్ఘంగా చర్చించి ఆమోదముద్ర వేసింది. సమావేశం అనంతరం సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి మీడియాకు కేబినెట్ నిర్ణయాలను సమగ్రంగా వివరించారు. లండన్, దుబాయ్ నగరాల్లోని ఐకానిక్ నిర్మాణాల తరహాలో, కృష్ణా నది ఒడ్డున ఆరు ఎకరాల విస్తీర్ణంలో 'అమరావతి ఐ' నిర్మాణానికి కేబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. డిజైన్, బిల్డ్, ఫైనాన్స్, ఆపరేట్ అండ్ ట్రాన్స్‌ఫర్ పద్ధతిలో 30 ఏళ్ల లీజు ప్రాతిపదికన ఈ ప్రాజెక్టును చేపట్టనున్నారు. దీనికోసం టెండర్లు ఆహ్వానించేందుకు మంత్రివర్గం అనుమతి ఇచ్చింది. ఈ ప్రాజెక్టు ద్వారా అమరావతి, కృష్ణా నది అందాలను పర్యాటకులు వీక్షించేందుకు వీలు కలుగుతుందని, ఇది ప్రపంచ పర్యాటక పటంలో అమరావతికి ప్రత్యేక స్థానం కల్పిస్తుందని ప్రభుత్వం భావిస్తోంది. అమరావతిలో నిర్మాణ పనులను వేగవంతం చేసే దిశగా కేబినెట్ పలు నిర్ణయాలు తీసుకుంది. హైకోర్టు భవనం బాహ్య సుందరీకరణ పనుల కోసం రూ. 547 కోట్లకు పరిపాలన అనుమతులు మంజూరు చేసింది. అదేవిధంగా, ఆల్ ఇండియా సర్వీసెస్ అధికారులు, ప్రిన్సిపల్ సెక్రటరీల నివాస భవనాల్లో హోమ్ ఆటోమేషన్, ఇతర ఆధునిక సౌకర్యాల కల్పన కోసం రూ. 94.90 కోట్ల పనులకు ఆమోదం తెలిపింది. రాజధానిలో అంతర్జాతీయ స్థాయి కన్వెన్షన్ సెంటర్ నిర్మాణం కోసం ఏపీఐఐసీకి ఎనిమిది ఎకరాల భూమి కేటాయింపును నిర్ధారించారు. రానున్న 9-10 నెలల్లో దీని నిర్మాణం పూర్తి చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు.

# వెంటనే రైతు భరోసా ఇవ్వాలి

**ఖరీఫ్‌కు ప్రభుత్వం సిద్ధం కావాలి.. మాజీ మంత్రి జీవన్ రెడ్డి డిమాండ్**



రాయికల్, జూన్ 4 (ఈవార్తలు): రైతులు ఖరీఫ్ సీజన్‌కు సిద్ధం అవుతున్న నేపథ్యంలో రైతు భరోసా అమలు చేయాలని బీఆర్ఎస్ పార్టీ సెక్రటరీ జనరల్, మాజీ మంత్రి తాటిపర్తి జీవన్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జగిత్యాల జిల్లా రాయికల్ మండలకేంద్రంలో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా యువజన నాయకుడు తాటిపర్తి సీకే రెడ్డి, గోపి రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు ఖరీఫ్ సీజన్‌కు సిద్ధమవుతున్న సమయంలో రైతు భరోసా అమలు స్పష్టంగా కనిపించడం లేదని అన్నారు. పంట రుణాలపై సరైన కార్యాచరణ లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ధాన్యం సేకరణలో సమస్యలు ఉన్నాయని, ప్రభుత్వం సమన్వయంతో పని చేయడం లేదని విమర్శించారు. ప్రత్యామ్నాయంగా పప్పు దినుసులు, నూనె గింజల సాగుకు ప్రోత్సాహం ఇవ్వాలని కోరారు. కోతుల బెడద ఎక్కువగా ఉందని, జిల్లాకు కోతుల నియంత్రణ కేంద్రం ఏర్పాటు చేయాలని సూచించారు. అలాగే సోలార్ ఫెన్సింగ్‌పై 50 శాతం రాయితీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎరువుల ధరలు పెరుగుతున్నాయని, యూరియా కొరత రైతులను ఇబ్బంది పెడుతోందని అన్నారు. రైతుల సమస్యలపై ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు.



## సాజిద్ కుటుంబానికి ఐజేయూ పరామర్శ

మెట్‌పల్లి, జూన్ 4 (ఈవార్తలు): టీయూడబ్ల్యూజే (ఐజేయూ) జగిత్యాల జిల్లా కార్యవర్గ సభ్యుడు సాజిద్ పాషా తండ్రి మృతి పట్ల టీయూడబ్ల్యూజే (ఐజేయూ) జిల్లా అధ్యక్షుడు చీటీ శ్రీనివాసరావు సంతాపం వ్యక్తం చేశారు. గురువారం ఆయనతో పాటు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మెట్‌పల్లిలోని సాజిద్ నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా మృతుడి మరణానికి గల కారణాలను అడిగి తెలుసుకున్న నాయకులు, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. మృతుడి ఆత్మకు శాంతి చేకూరాలని, కుటుంబ సభ్యులకు ఈ విషాదాన్ని తట్టుకునే మనోధైర్యం కలగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో జిల్లా ఐజేయూ ప్రధాన కార్యదర్శి సంపూర్ణాచారి, ఖజాంచి వేణుగోపాల్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వేణుగోపాలాచారి, మెట్‌పల్లి ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు డాక్టర్ బూరం సంజీవ్, ఉపాధ్యక్షుడు మహ్మద్ అఫ్రోజ్, సంయుక్త కార్యదర్శి పింజరి శివ, కార్యవర్గ సభ్యులు మహేందర్, రాజేందర్, తేలుకంటి గంగాధర్, కౌన్సిలర్ ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

## టీడీపీకి 3, జనసేనకు 1

**ఏపీ రాజ్యసభ సీట్ల పంపకం పూర్తి.. బీజేపీకి దక్కని రాజ్యసభ అవకాశం**

ఉండవల్లి, జూన్ 4 (ఈవార్తలు): ఆంధ్రప్రదేశ్‌లో నాలుగు రాజ్యసభ స్థానాలకు సంబంధించి అధికార ఎన్డీఏ కూటమిలో సీట్ల పంపకం ఖరారైంది. కూటమిలోని ప్రధాన పార్టీ అయిన తెలుగుదేశం పార్టీ (టీడీపీ) మూడు స్థానాలను తీసుకోనుండగా, జనసేన పార్టీకి ఒక స్థానాన్ని కేటాయించారు. ఈ సర్దుబాటులో బీజేపీకి ఈసారి అవకాశం లభించలేదు. ఉండవల్లిలోని చంద్రబాబు క్యాంపు కార్యాలయంలో గురువారం జరిగిన కీలక సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ భేటీలో సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, ఏపీ బీజేపీ అధ్యక్షుడు మాధవ్ పాల్గొన్నారు. ఈ భేటీలో మిత్రపక్ష నేతలతో చర్చించిన అనంతరం, సీట్ల కేటాయింపు నిర్ణయాన్ని సీఎం స్వయంగా వెల్లడించారు. మూడు పార్టీల నేతల ఏకాభిప్రాయంతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. త్వరలోనే రాజ్యసభ అభ్యర్థుల పేర్లను అధికారికంగా ప్రకటిస్తామని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. రాష్ట్ర అసెంబ్లీలో ఉన్న సంఖ్యా బలం ఆధారంగానే ఈ కేటాయింపులు జరిపినట్లు స్పష్టమవుతోంది. అసెంబ్లీలో టీడీపీకి భారీ మెజారిటీ ఉండగా, జనసేనకు 21 మంది ఎమ్మెల్యేలు ఉన్నారు. షెడ్యూల్ ప్రకారం జూన్ 18న నాలుగు రాజ్యసభ స్థానాలకు పోలింగ్ జరగనుంది. ప్రస్తుతం వైసీపీకి చెందిన మూడు, టీడీపీకి చెందిన ఒక స్థానం ఖాళీ అవుతున్నాయి. అసెంబ్లీలో ఎన్డీఏ కూటమికి ఉన్న పూర్తి ఆధిక్యతతో ఈ నాలుగు స్థానాలనూ గెలుచుకోవడం లాంఛనప్రాయమే.

## దమ్ముంటే అరెస్ట్ చేయండి

**కూటమి సర్కారుకు పేర్ని నాని సవాల్**

మచిలీపట్నం, జూన్ 4 (ఈవార్తలు): ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో డీఎస్సీ, స్పోర్ట్స్ కోటా ఉద్యోగాల భర్తీ వ్యవహారం ఇప్పుడు తీవ్ర దుమారం రేపుతోంది. ఈ అంశంపై వైసీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి పేర్ని నాని కూటమి ప్రభుత్వంపై ధ్వజమెత్తారు. సీఎం చంద్రబాబు, మంత్రులు అనిత, కొల్లు రవీంద్రలను టార్గెట్ చేస్తూ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. మచిలీపట్నం అసెంబ్లీ నియోజకవర్గ ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ అవగాహన సదస్సులో మాట్లాడిన ఆయన.. ప్రభుత్వానికి ఒక సవాల్ విసిరారు. "నేను బియ్యం దొంగతనం చేశానని నాపై ఆరోపణలు చేస్తున్నారు. మీకు నిజంగా ధైర్యముంటే, నాపై విచారణ జరిపించి నన్ను జైల్లో పెట్టండి. 2029 నాటికి చంద్రబాబు ప్రభుత్వం కచ్చితంగా పడిపోతుంది. అంతవరకు మీకు చేతనైతే, దమ్ముంటే నన్ను అరెస్ట్ చేయండి" అంటూ పేర్ని నాని సంచలన వ్యాఖ్యలు చేశారు. స్పోర్ట్స్ కోటా నియామకాల్లో పెద్ద ఎత్తున అక్రమాలు జరిగాయని పేర్ని నాని ఆరోపించారు. ప్రభుత్వం మొదట క్రీడా కోటాను 3 శాతానికి పెంచుతూ జీవో ఇచ్చిందని, ఆ తర్వాత 382 మంది ఎంపికయ్యారని చెప్పిందని.. కానీ ఇటీవలే ఆటల సంఖ్యను 29 నుంచి ఏకంగా 67 కి పెంచి, అందులో 'బ్రిడ్జ్' (పేకాట) ను కూడా చేర్చారని విమర్శించారు. ఎంపికైన అభ్యర్థుల జాబితాను గత 9 నెలలుగా ఎందుకు బహిరంగపరచడం లేదు? ఐఏఎస్ అధికారి సంతకం కూడా లేకుండా ఆ లిస్ట్‌ను ఎలా విడుదల చేశారు? ఇప్పుడు కార్డు గేమ్స్ (పేకాట) ఆడేవారిని ఎంపిక చేయలేదని ప్రభుత్వం ఎందుకు మాట మారుస్తోంది? అని ప్రశ్నించారు. డీఎస్సీ నియామకాల్లో జరిగిన భారీ అక్రమాలను కప్పిపుచ్చుకోవడానికే కూటమి ప్రభుత్వం ప్రయత్నిస్తోందని, ప్రతిపక్షాల విమర్శలను తిప్పికొట్టడానికి హోంమంత్రి అనితను ఒక కవచంలా వాడుకుంటోందని పేర్ని నాని మండిపడ్డారు. రాష్ట్రంలో మహిళలు, బాలికలపై జరుగుతున్న అరాచకాలపై నోరు మెదపని ప్రభుత్వం.. ప్రతిపక్షాలు డీఎస్సీ స్కామ్‌ను లేవనెత్తినప్పుడు మాత్రం హైపర్‌యాక్టివ్‌గా మారుతోందని ధ్వజమెత్తారు. డీఎస్సీ రిక్రూట్‌మెంట్‌లో జరిగిన 'పాపాలు' చంద్రబాబును, ఆయన మంత్రులను వదిలిపెట్టవని పేర్ని నాని హెచ్చరించారు.

## తిరుమల కల్తీ నెయ్యి కేసులో ఈడీ స్పీడప్

**6 రాష్ట్రాల్లో 15 చోట్ల ఏకకాలంలో సోదాలు**

తిరుమల, జూన్ 4 (ఈవార్తలు): తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ)లో కలకలం రేపిన కల్తీ నెయ్యి కుంభకోణం కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) దర్యాప్తును వేగవంతం చేసింది. ఈ కేసుతో సంబంధం ఉన్న మనీలాండరింగ్ ఆరోపణలపై బుధవారం దేశవ్యాప్తంగా ఆరు రాష్ట్రాల్లోని 15 ప్రాంతాల్లో ఏకకాలంలో సోదాలు నిర్వహించింది. ఈ తనిఖీల్లో రూ.60 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నట్లు అధికారులు వెల్లడించారు. మహారాష్ట్ర (అహిల్యనగర్, ముంబై), రాజస్థాన్ (బికనీర్), ఉత్తరాఖండ్ (డెహ్రాడూన్, రూర్కీ), తమిళనాడు (దిండిగల్), ఆంధ్రప్రదేశ్ (గుంటూరు), ఢిల్లీలలో ఈడీ బృందాలు సోదాలు జరిపాయి. ఏఆర్ డెయిరీ ఫుడ్ ప్రైవేట్ లిమిటెడ్ మరికొందరిపై నమోదైన ఎఫ్ఐఆర్ ఆధారంగా ఈడీ మనీలాండరింగ్ నిరోధక చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించింది. నిందితులు కొందరు టీటీడీ అధికారులతో కుమ్మక్కై, తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదం తయారీకి నాణ్యత లేని, కల్తీ నెయ్యి సరఫరా చేశారని ఆరోపణలు ఉన్నాయి. దీనివల్ల టీటీడీకి తీవ్ర నష్టం వాటిల్లిందని అధికారులు గుర్తించారు. గతంలో ఈ కేసుపై సీబీఐ నేతృత్వంలోని ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) విచారణ జరిపింది. టెండర్లు, సరఫరాలలో అవకతవకలు జరిగినట్లు అప్పట్లో తేలింది. ఇప్పుడు ఈడీ రంగంలోకి దిగి హవాలా లావాదేవీలు, అక్రమ మార్గాల్లో సంపాదించిన డబ్బుతో స్థిరాస్తులు కొనుగోలు చేయడం వంటి అంశాలపై దృష్టి సారించింది. కేసులో దర్యాప్తు కొనసాగుతోందని ఈడీ అధికారులు తెలిపారు.

## వయ్యారి చిత్రం


ప్రిషా సింగ్



## పొల్లాచ్చిలో చిరంజీవి సందడి

మెగాస్టార్ చిరంజీవి హీరోగా, ప్రముఖ దర్శకుడు బాబీ కొల్లి (కె.ఎస్. రవీంద్ర) దర్శకత్వంలో తెరకెక్కుతున్న భారీ యాక్షన్ ఎంటర్‌టైనర్ మెగా158 షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. తాజాగా ఈ చిత్ర యూనిట్ తమిళనాడులోని పొల్లాచ్చిలో కొత్త షెడ్యూల్‌ను ప్రారంభించింది. ఈ షెడ్యూల్‌లో మెగాస్టార్ చిరంజీవితో పాటు ఇతర ప్రధాన తారాగణంపై కీలక సన్నివేశాలను చిత్రీకరిస్తున్నట్లు సమాచారం. ఇటీవలే ఈ చిత్రంలో యువ నటి అనస్వర రాజన్‌ను తీసుకున్నట్లు నిర్మాణ సంస్థ కేవీఎన్ ప్రొడక్షన్స్ అధికారికంగా ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ సినిమాతో ఆమె తెలుగు తెరకు పరిచయం కాబోతున్నారు. 'వాల్తేరు వీరయ్య' వంటి బ్లాక్‌బస్టర్ తర్వాత చిరంజీవి-బాబీ కాంబినేషన్‌లో వస్తున్న రెండో సినిమా కావడంతో మెగా158పై భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ సినిమా కోసం చిరంజీవి జిమ్‌లో తీవ్రంగా శ్రమిస్తున్న వీడియోలు కూడా ఇటీవల సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. కేవీఎన్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై వెంకట్ కె. నారాయణ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ చిత్రానికి ప్రముఖ సంగీత దర్శకుడు తమన్ సంగీతం అందిస్తుండగా, 'జైలర్' ఫేమ్ విజయ్ కార్తీక్ కన్నన్ సినిమాటోగ్రాఫర్‌గా పనిచేస్తున్నారు. కొల్లా అవినాష్ ఆర్ట్ డైరెక్టర్‌గా, ఆంటోనీ రూబెన్ ఎడిటర్‌గా వ్యవహరిస్తున్నారు.

## రమానందన దంపతులపై లుకౌట్ నోటీసులు

ఫేమస్ యూట్యూబ్ ఛానల్ 'నందూస్ వరల్డ్' నిర్వాహకురాలు, షార్ట్ ఫిల్మ్ నటి రమా నందన (నందు), ఆమె భర్త మధుకర్‌లపై పోలీసులు లుకౌట్ నోటీసులు జారీ చేసినట్లు సమాచారం. పైకి అమాయకంగా యూట్యూబ్ వీడియోలు చేస్తూ పాపులర్ అయిన ఈ దంపతులు, తెరవెనుక భారీ మోసానికి పాల్పడినట్లు ఆరోపణలు రావడంతో ఏపీలోని ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నం పోలీసులు కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. నిందితులు వేరే దేశంలో ఉండటంతో వారిపై లుకౌట్ నోటీసులు జారీ



చేసినట్లు తెలుస్తోంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈ యూట్యూబర్ దంపతులు 'డెస్టినీ కన్సల్టెన్సీ' పేరుతో వీసా రెన్యువల్ చేస్తామంటూ అమాయకులను బురిడీ కొట్టించారు. పశ్చిమ ఇబ్రహీంపట్నానికి చెందిన మామిళ్ళపల్లి శివ క్రాంతి కుమార్ అనే బాధితుడు యూకేలో ఉంటున్న సమయంలో ఆయన వీసా గడువు ముగింపు దశకు చేరుకుంది. దీంతో ఆయన సదరు కన్సల్టెన్సీ నిర్వాహకులను సంప్రదించాడు. ఇండియాలో ఉన్న తమ బ్రాంచ్‌లో డబ్బులు చెల్లిస్తే వీసా ప్రక్రియ అంతా పూర్తి చేస్తామని నిందితులు నమ్మబలకడంతో, బాధితుడు వారికి ఏకంగా రూ. 15 లక్షల వరకు చెల్లించాడు. నెలలు గడుస్తున్నా వీసా రాకపోవడంతో పాటు, ఇచ్చిన డబ్బుల గురించి నిలదీస్తే నిందితుల నుంచి కనీస స్పందన లేదు. సరైన సమాధానం రాకపోవడంతో తాను మోసపోయానని గ్రహించిన బాధితుడు శివ క్రాంతి కుమార్.. నేరుగా ఇబ్రహీంపట్నం పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశాడు.

## నాగచైతన్యకు ఊరట

టాలీవుడ్ నటుడు నాగచైతన్య వ్యక్తిగత హక్కులకు భంగం కలగకుండా ఢిల్లీ హైకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. ఆయన అనుమతి లేకుండా అశ్లీల కంటెంట్, అసభ్యకరమైన రీతిలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఉపయోగించి రూపొందించిన చిత్రాలు, వీడియోలను ఇంటర్నెట్‌లో ప్రసారం చేయడాన్ని కోర్టు తీవ్రంగా పరిగణించి, వాటిపై నిషేధం విధించింది. ఓ సెలబ్రిటీ పేరు, వాయిస్, ఫొటోలు, వ్యక్తిత్వాన్ని వారి అనుమతి లేకుండా వాణిజ్యపరంగా తప్పుడు మార్గాల్లో ఉపయోగించకుండా ఉండేందుకు ఢిల్లీ హైకోర్టు రక్షణ కల్పించింది. ఇటీవల కాలంలో సెలబ్రిటీల ముఖాలను డీప్‌ఫేక్ టెక్నాలజీ ద్వారా అశ్లీల చిత్రాలలో, అసభ్యకరమైన సన్నివేశాలలో సృష్టిస్తున్న తరుణంలో, నాగచైతన్యకు సంబంధించి అలాంటి కంటెంట్‌ను వ్యాప్తి చేయడాన్ని హైకోర్టు పూర్తిగా అడ్డుకుంది. ఇంటర్నెట్ సర్వీస్ ప్రొవైడర్లు, డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌లు ఇలాంటి అభ్యంతరకరమైన కంటెంట్‌ను తక్షణమే తొలగించాలని, ప్రసారాలను నిలిపివేయాలని కోర్టు ఆదేశించింది. కాగా, గతంలో అమితాబ్ బచ్చన్, అనిల్ కపూర్, రజనీకాంత్ వంటి అగ్ర నటులు కూడా తమ పర్సనాలిటీ రైట్స్ కోసం కోర్టును ఆశ్రయించి ఇలాంటి రక్షణను పొందారు. ప్రస్తుతం టాలీవుడ్ నుంచి నాగచైతన్య కూడా తన డిజిటల్ భద్రత, వ్యక్తిగత ప్రతిష్టను కాపాడుకునేందుకు ఈ చట్టపరమైన విజయాన్ని సాధించారు.



## 96 కేజీల బరువు ఉండేదాన్ని



బాలీవుడ్ స్టార్ నటుడు సైఫ్ అలీ ఖాన్ వారసురాలుగా ఇండస్ట్రీకి ఎంట్రీ ఇచ్చింది యంగ్ బ్యూటీ సారా అలీ ఖాన్. తన నటన, అందంతో ప్రేక్షకులను ఆకట్టుకున్న ఈ బ్యూటీ ప్రస్తుతం వరుస ఆఫర్లు అందుకుంటుంది. ఈ క్రమంలోనే రీసెంట్‌గా 'పతి పత్ని ఔర్ వోదో'తో ప్రేక్షకుల ముందుకు వచ్చి సందడి చేసింది. సారా అలీఖాన్, రకుల్ ప్రీత్ సింగ్, వామికా గబ్బి, ఆయుష్మాన్ ఖురానా ప్రధాన పాత్రల్లో నటించిన ఈ చిత్రం మే 15న విడదలై మంచి టాక్ సొంతం చేసుకుంది. ఇందిలా ఉంటే.. రీసెంట్‌గా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న ఈ బ్యూటీ సినిమాల్లోకి రాకముందు తాను 96 కేజీల బరువు ఉండగా.. దాన్ని తగ్గించడం కోసం ఎంత కష్టపడిందో చెప్పుకొచ్చింది. 'నేను న్యూయార్క్‌లో చదువుకునేటప్పుడు ప్రతిరోజూ రెండు మీడియం పిజ్జాలు ఆర్డర్ చేసుకునేదాన్ని. మూడు చాకోచిప్ బ్రౌనీలతో నా రోజు స్టార్ట్ అయ్యేది. అలాగే ఒకేసారి 6 వడా పావ్‌లు తినేదానిని.. పావ్ భాజీని ఎక్కువ వెన్నతో, బిర్యానీని ఎక్కువ ఆలుతో తినేదాన్ని. సినిమాల్లోకి రాకముందు నా బరువు 96 కేజీలు ఉండేది. అయితే.. సినిమాల్లోకి ఎంట్రీ ఇచ్చేముందు ఫిట్ నెస్‌పై ఫోకస్ పెట్టాను. బరువు తగ్గించే ప్రయాణంలో కఠినమైన ఆహారం, క్రమశిక్షణతో కూడిన జీవనశైలిని అనుసరించి ఏకంగా 45 కిలోల బరువు తగ్గాను. అయితే నాకున్న పీసీఓఎస్ (గ్రాజూూ) సమస్యలను అధిగమించడానికి, ఫిట్‌నెస్‌తో ఈ మార్పును సాధించాను. దీని కోసం.. నాకు ఇష్టమైన జంక్ ఫుడ్, నూనెలో వేయించిన స్నాక్స్, చక్కెర (షుగర్), పాలతో తయారు చేసేవాటికి దూరంగా ఉండేదాన్ని. ఇంట్లో వండిన ఆరోగ్యకరమైన ఆహారం, కార్బోహైడ్రేట్లు తక్కువగా, ప్రోటీన్ ఎక్కువగా ఉండే డైట్‌ను ఫాలో అయ్యేదాన్ని. అలాగే కేవలం డైట్ మాత్రమే కాకుండా.. వ్యాయామం తప్పకుండా చేసేదాన్ని. ఎందుకంటే బరువు తగ్గడం అనేది నా కెరీర్ కోసం మాత్రమే కాదు.. శారీరక, మానసిక శ్రేయస్సు కోసం.

## నటిని అవ్వాలనుకోలేదు: అహల్య బమ్రూ



94ఏళ్ల వయసులో లెజెండరీ డైరెక్టర్ సంగీతం శ్రీనివాసరావు దర్శకత్వం వహిస్తున్న లేటెస్ట్ మూవీ 'సింగ్ గీతం'. ఈ సినిమాను 'కల్కి' డైరెక్టర్ నాగ్ అశ్విన్ సమర్పిస్తుండగా.. అయాన్, అహల్య బమ్రూ, షాలిని కొండేపూడి ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. ప్రస్తుతం నిర్మాణానంతరం పనుల్లో బిజీగా ఉన్నా ఈ మూవీ జూన్ 11న ప్రేక్షకుల ముందుకు రాబోతున్నది. ఈ క్రమంలోనే తాజాగా ఇంటర్వ్యూలో పాల్గొన్న యంగ్ నటి అహల్య బమ్రూ తన పాత్రకు సంబంధించిన విశేషాలు పంచుకుంది. 'నేను ఎప్పుడూ నటిని అవ్వాలని అనుకోలేదు. ఇన్‌స్టాగ్రామ్‌లో కంటెంట్ క్రియేట్ చేస్తుంటాను. నాగ్ అశ్విన్ గారు నా కంటెంట్ చూసి 'సింగ్ గీతం'లో ఆఫర్ ఇచ్చారు. నా ఆడిషన్ కూడా ఇన్‌స్టాగ్రామ్ ద్వారానే ఇచ్చాను. 94 ఏళ్ల వయసులో మోడ్రన్ ఆలోచనతో సినిమా చేయడం సంగీతంగారికే సాధ్యం. సంగీతం శ్రీనివాస్ గారి సినిమాల్లో మహిళల పాత్రలు బలంగా ఉంటాయి. అలాంటిది ఆయన సినిమాలో నాకు అవకాశం రావడం సంతోషంగా ఉంది' అని తెలిపింది.



## ప్రకాశ్ రాజ్ వర్సెస్ బండ్ల గణేశ్

జనసేన అధినేత పవన్ కల్యాణ్ పై నటుడు ప్రకాశ్ రాజ్ చేసిన వ్యాఖ్యలు, దానికి టాలీవుడ్ నిర్మాత బండ్ల గణేశ్ ఇచ్చిన కౌంటర్ తో సినీ, రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్ గా మారాయి. ఇటీవల తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పవన్ కల్యాణ్ మాట్లాడుతూ.. రాబోయే రోజుల్లో తెలంగాణలోనూ జనసేన పార్టీ పోటీ చేస్తుందని స్పష్టం చేశారు. ఈ పరిణామంపై ప్రకాశ్ రాజ్ స్పందిస్తూ "మీరొస్తానంటే మేమొద్దంటామా? "రండి దొర.. కానీ పొత్తుతో వస్తున్నారా లేదా సింగిల్‌గా వస్తున్నారా అది చెప్పి రండి" అంటూ పవన్ కల్యాణ్‌ను ఉద్దేశించి పరోక్షంగా ట్విట్టర్ వేదికగా ఘాటు పోస్ట్ పెట్టారు. ప్రకాశ్ రాజ్ చేసిన ఈ వ్యాఖ్యలపై సినీ నిర్మాత బండ్ల గణేశ్ విరుచుకుపడ్డారు. సమాజంలో జరిగే ప్రతి అంశంలోనూ ప్రకాశ్ రాజ్ అనవసరంగా జోక్యం చేసుకుంటున్నారని మండిపడ్డారు. ప్రతి ఊర్లో, ప్రతి ఇష్యూలో దూరి జడ్జిమెంట్‌లు ఇవ్వడానికి మీరేమైనా జిల్లా కలెక్టరా లేక దేశ ప్రధాని అనుకుంటున్నారా? అంటూ బండ్ల గణేశ్ ప్రశ్నించారు. ఈ ఇద్దరు ప్రముఖుల మధ్య చోటుచేసుకున్న ఈ 'ట్విట్టర్ వార్' తెలుగు రాష్ట్రాల రాజకీయాల్లో మరింత వేడిని రగిల్చింది.

## సిగ్మా.. ఫస్ట్ సింగిల్ రిలీజ్

సందీప్ కిషన్, ఫరియా అబ్దుల్లా కలయికలో వస్తున్న చిత్రం 'సిగ్మా'. ఈ భారీ యాక్షన్ ఎంటర్‌టైనర్‌తో తమిళ స్టార్ హీరో, తమిళనాడు ప్రస్తుత ముఖ్యమంత్రి దళపతి విజయ్ తనయుడు జాసన్ సంజయ్ దర్శకుడిగా ఇండస్ట్రీకి పరిచయం కాబోతున్నాడు. దీంతో ఈ ప్రాజెక్ట్‌పై కోలీవుడ్‌తో పాటు టాలీవుడ్‌లోనూ భారీ అంచనాలు నెలకొన్నాయి. తమన్ సంగీతం అందిస్తుండగా.. లైకా ప్రొడక్షన్స్ బ్యానర్‌పై సుభాస్కరణ్ నిర్మిస్తున్నారు. ప్రస్తుతం శరవేగంగా షూటింగ్ జరుపుకుంటున్న ఈ సినిమాను జూలై 31న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయడానికి చిత్రబృందం ప్లాన్ చేస్తోంది.






## విరాట్ దూరం..
# రోహిత్ కూడా!

**త్వరలో ఆఫ్ఘనిస్తాన్‌తో జరగబోయే మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్‌కు ముందు టీమిండియాకు పెద్ద షాక్ తగిలేలా కనిపిస్తోంది. ఇప్పటికే స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ గాయం కారణంగా ఈ సిరీస్ మొత్తానికి దూరం కాగా.. ఇప్పుడు మరో సీనియర్ ప్లేయర్ రోహిత్ శర్మ ఆడటంపై కూడా తీవ్ర సందిగ్ధత నెలకొంది.**

ఐపీఎల్ 2026 సీజన్‌లో తగిలిన హ్యామ్ స్ట్రింగ్ గాయం కారణంగా రోహిత్ ఈ సిరీస్‌కు అందుబాటులో ఉండకపోవచ్చని బీసీసీఐ వర్గాల ద్వారా బలమైన వార్తలు వస్తున్నాయి. శ్రీలంకతో సిరీస్ తర్వాత సుదీర్ఘ విరామం తీసుకున్న సీనియర్ ఆటగాళ్లు ఈ సిరీస్‌లో ఫామ్‌లోకి రావాలని భావించారు. కానీ గాయాల సమస్యలు ఇప్పుడు మేనేజ్‌మెంట్‌ను కలవరపెడుతున్నాయి.

ఇటీవల ముగిసిన ఐపీఎల్ 2026 ఫైనల్ మ్యాచ్‌లో గుజరాత్‌లో టైటాన్స్‌తో తలపడిన సందర్భంగా రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు స్టార్ విరాట్ కోహ్లీ తీవ్రమైన హ్యామ్ స్ట్రింగ్ నొప్పితో బాధపడ్డాడు. రన్నింగ్ చేయడంలో ఇబ్బంది పడినప్పటికీ జట్టు కోసం కీలక ఇన్నింగ్స్ ఆడాడు. అయితే ఈ గాయం తిరగబెట్టడంతో అతను అఫ్ఘాన్ సీరీస్ నుండి పూర్తిగా తప్పుకున్నట్లు పీటీఐ నివేదించింది. మరోవైపు, ముంబై ఇండియన్స్ తరఫున ఆడిన రోహిత్ శర్మ కూడా ఐపీఎల్ సీజన్ మధ్యలోనే హ్యామ్ స్ట్రింగ్ గాయానికి గురయ్యాడు. అందువల్లనే అతను కొన్ని మ్యాచ్లలో కేవలం ఇంపాక్ట్ ప్లేయర్‌గా మాత్రమే పరిమితమయ్యాడు. బీసీసీఐ ప్రకటించిన 15 మంది సభ్యుల వన్డే జట్టులో రోహిత్ శర్మ పేరు ఉన్నప్పటికీ, అది ఫిట్నెస్ క్లియరెన్స్ సాధించడంపైనే ఆధారపడి ఉంటుందనీ సెలెక్టర్లు ముందే స్పష్టం చేశారు. అయితే తాజా సమాచారం ప్రకారం. బెంగళూరులోని నేషనల్ క్రికెట్ అకాడమీ నిర్వహించే ఫిట్నెస్ పరీక్షల్లో రోహిత్ ఇంకా పూర్తి స్థాయి ప్రమాణాలు అందుకోలేదని తెలుస్తోంది. కేవలం రోహిత్ మాత్రమే కాదు. ఆల్ రౌండర్ హార్దిక్ పాండ్యా ఫిట్నెస్‌ను కూడా బీసీసీఐ నిశితంగా గమనిస్తోంది. ఐపీఎల్ సమయంలో అతనికి లోయర్ బ్యాక్ (నడుము కింది భాగం) పట్టేయడంతో కొన్ని మ్యాచ్లకు దూరమయ్యాడు. సిరీస్ ప్రారంభానికి ముందు బెంగళూరులో హార్దిక్‌కు కూడా ఫిటెనెస్ పీరీక్షలు నిర్వహించనున్నారు. ఈ జట్టుకు శుభ్ మన్ గిల్ వన్డే జట్టుకు సారథ్యం వహించనున్నాడు. జస్ప్రీత్ బుమ్రా, మహ్మద్ సిరాజ్ వంటి సీనియర్ బౌలర్లకు ఇప్పటికి వర్క్ లోడ్ మేనేజ్మెంట్లో భాగంగా విశ్రాంతినిచ్చారు. ఒకవేళ రోహిత్ శర్మ తొలి వన్డే నాటికి కోలుకోలేకపోతే, చాలా కాలం తర్వాత వన్డే జట్టులోకి పునరాగమనం చేసిన ఇషాన్ కిషన్ ఓపెనర్‌గా బరిలోకి దిగే అవకాశం ఉంది. జూన్ 6 నుంచి న్యూ ఛండీగఢ్‌లో ఇరు జట్ల మధ్య ఏకైక టెస్ట్ మ్యాచ్ జరగనుండగా, జూన్ 13 నుండి ధర్మశాల వేదికగా సిరీస్ ప్రారంభం కానుంది. రోహిత్ కులుకుంటాడో లేదో చూడాలి.


### ఆఫ్ఘనిస్తాన్‌తో వన్డే సిరీస్‌కు కోహ్లీ దూరం

ఆఫ్ఘనిస్తాన్‌తో జరగనున్న వన్డే సిరీస్‌కు విరాట్ కోహ్లీ దూరం కానున్నాడు. అతను తొడకండరాల నొప్పితో బాధపడుతున్నట్లు తెలిసింది. ఇటీవల ముగిసిన ఐపీఎల్ టోర్నీలో.. ఆర్సీబీ బ్యాటర్ విరాట్ కోహ్లీ అద్భుత ప్రదర్శన ఇచ్చిన విషయం తెలిసిందే. అయితే జూన్ 13వ తేదీ నుంచి ఆఫ్ఘనిస్తాన్‌తో జరగనున్న వన్డే సిరీస్‌కు కోహ్లీని ఎంపిక చేయడం లేదని తెలిసింది. తొడకండరాల నొప్పి వల్ల అతను వన్డే సిరీస్ ఆడకపోవచ్చు అని బీసీసీఐ అధికారి ఒకరు తెలిపారు. 37 ఏళ్ల కోహ్లీ.. ఈ యేటి ఐపీఎల్‌లో 675 రన్స్ చేసి తన ఫిట్‌నెస్ చాటుకున్నాడు. ఈ సీజన్‌లో అతను ఓ సెంచరీ, అయిదు హాఫ్ సెంచరీలు కొట్టాడు. అయితే ఆఫ్ఘన్‌తో సిరీస్‌కు అతను అందుబాటులో లేకపోవడం భారత జట్టుకు లోటే అవుతుంది. ఫిట్‌నెస్‌లో అత్యున్నత ప్రమాణాలు పాటిస్తున్న అతను వన్డే సిరీస్ మిస్ కావడం చాలా అరుదైన అంశం.



## క్రికెట్‌కు
# కేఎస్ భరత్ గుడ్‌బై

భారత వికెట్ కీపర్ బ్యాటర్, ఆంధ్రప్రదేశ్ రంజీ జట్టు కెప్టెన్ కోన శ్రీకర్ భరత్ అంతర్జాతీయ క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటిస్తూ సంచలన నిర్ణయం తీసుకున్నారు. దేశం తరఫున ఆడటం తన జీవితంలోనే అత్యంత గౌరవప్రదమైన విషయమని పేర్కొంటూ ఆయన సోషల్ మీడియా వేదికగా అంతర్జాతీయ క్రికెట్ ప్రస్థానానికి ముగింపు పలికారు. రిటైర్మెంట్ ప్రకటిస్తూ భరత్ తన ఇన్‌స్టాగ్రామ్‌లో ఒక సుదీర్ఘమైన, భావోద్వేగభరితమైన పోస్ట్‌ను పంచుకున్నారు. 'ఎంతో గర్వంతో, అంతకు మించిన కృతజ్ఞతతో అంతర్జాతీయ క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటిస్తున్నాను. నా మాతృభూమికి ప్రాతినిధ్యం వహించడం నా జీవితంలోనే అతిపెద్ద గౌరవం. ఈ ప్రయాణంలో ఎన్నో సవాళ్లు ఎదురయ్యాయి, కానీ భారత్ తరఫున టెస్టు మ్యాచ్‌ల్లో బరిలోకి దిగిన ప్రతి క్షణం నా కష్టానికి తగిన ప్రతిఫలాన్ని ఇచ్చింది. మా నలుగురి కుటుంబం గత రెండు దశాబ్దాలుగా ఒకే కలను శ్వాసించింది. నా వెన్నంటి నిలిచిన నా సోదరి, అమ్మ, నాన్నలకు నా హృదయపూర్వక ధన్యవాదాలు. వారి ప్రేమ, క్రమశిక్షణ, కష్టానికి ప్రతిరూపమే ఈరోజు నేను' అని భరత్ రాసుకొచ్చారు. రిషభ్ పంత్ ప్రమాదానికి గురైన సమయంలో 2023లో ఆస్ట్రేలియాపై బోర్డర్-గవాస్కర్ ట్రోఫీలో కేఎస్ భరత్ భరత్ టెస్టుల్లో అరంగేట్రం చేశారు. భారత్ తరఫున మొత్తం 7 టెస్ట్ మ్యాచ్‌లు ఆడిన భరత్.. 20.09 సగటుతో 221 పరుగులు చేశారు. ఇందులో అత్యధిక వ్యక్తిగత స్కోరు 44 పరుగులు. దేశవాళీ క్రికెట్‌లో ఆంధ్ర జట్టు తరఫున భరత్‌కు అద్భుతమైన రికార్డు ఉంది. రంజీ ట్రోఫీ చరిత్రలోనే ట్రిపుల్ సెంచరీ (302) సాధించిన తొలి వికెట్ కీపర్ బ్యాటర్‌గా 2015లో ఆయన చరిత్ర సృష్టించారు. ఇక ఐపీఎల్‌లో ఢిల్లీ డేర్‌డెవిల్స్, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (=జదీ), గుజరాత్ టైటాన్స్, కోల్‌కతా నైట్ రైడర్స్ జట్లకు భరత్ ప్రాతినిధ్యం వహించారు. ముఖ్యంగా 2021లో ఆర్‌సీబీ తరఫున ఆఖరి బంతికి సిక్స్ కొట్టి జట్టును గెలిపించిన మ్యాచ్ భరత్ కెరీర్‌లోనే మైలురాయిగా నిలిచింది.






# హార్దిక్‌తో విభేదాల్లేవ్

ఐపీఎల్ 2026లో హార్దిక్ పాండ్య, కృనాల్ పాండ్య మధ్య విభేదాలు తలెత్తినట్లు వార్తలొచ్చాయి. ఆర్సీబీతో మ్యాచ్ సమయంలో హార్దిక్ ఔటైన తర్వాత కృనాల్ పెద్దఎత్తున సంబరాలు చేసుకోవడం.. అతడిని చూస్తూ హార్దిక్ డగౌట్‌కు వెళ్లడం సోషల్ మీడియాలో వీడియోలు వైరల్‌గా మారాయి. వరుసగా ఆర్సీబీ రెండో టైటిల్ సాధించడంలో కృనాల్ పాండ్యా కీలకపాత్ర పోషించినప్పటికీ అతడికి హార్దిక్ అభినందనలు తెలుపుతూ కనీసం ఒక్క పోస్ట్ కూడా సోషల్ మీడియాలో పెట్టలేదు. సోదరుడితో విభేదాల కారణంగానే హార్దిక్ మౌనంగా ఉన్నాడంటూ ప్రచారం జరిగింది. అయితే, వీటన్నింటిని కృనాల్ పాండ్య కొట్టిపారేశాడు. తమ మధ్య ఎలాంటి విభేదాలు లేవని స్పష్టతనిచ్చాడు. 'మేం ఇద్దరం కలిసి ఆడాం. క్రికెట్‌ను ఎల్లప్పుడూ వ్యూహాత్మక, సాంకేతిక అంశాల పరంగానే చర్చించాం. మా మధ్య ఎప్పుడూ ఎంతో ఆరోగ్యకరమైన చర్చ జరుగుతూనే ఉంది. సోదరులిద్దరూ ఒకే క్రీడ ఆడుతుంటే అది ఎప్పుడూ ఒకరికొకరు సహాయపడటానికి దోహదపడుతుంది. పాండ్య కుటుంబంలో 10 ఐపీఎల్ ట్రోఫీలు ఉండటం అనేది తక్కువ సంఖ్యేమీకాదు. దేవుడి దయ ఉంది" అని కృనాల్ వివరించాడు. హార్దిక్ ముంబయి తరఫున నాలుగు, గుజరాత్ టైటాన్స్ కెప్టెన్‌గా ఒకసారి ఐపీఎల్ ట్రోఫీ సాధించిన విషయం తెలిసిందే. కృనాల్ ముంబయి తరఫున మూడు, ఆర్సీబీ తరఫున రెండు టైటిళ్లు సాధించాడు.



# మళ్లీ ఓడిన సింధు
## ఇండోనేషియా ఓపెన్ నుంచి ఔట్

ఒలింపిక్ మెడలిస్ట్ పీవీ సింధు.. ఇండోనేషియన్ ఓపెన్‌లో ఓటమి పాలైంది. వరల్డ్ నెంబర్ వన్ ప్లేయర్ ఆన్ సే యంగ్ చేతిలో ఆమ పరాజయాన్ని చూవిచూసింది. 17-21, 14-21 స్కోరుతో దక్షిణ కొరియా క్రీడాకారిణి విజయాన్ని నమోదు చేసింది. అయితే ఇటీవల వరుసగా రెండోసారి ఆన్ సే యంగ్ చేతిలో పీవీ సింధు ఓడింది. గత వారం సింగపూర్ ఓపెన్ క్వార్టర్స్‌లోనూ సింధు ఓటమి పాలైన విషయం తెలిసిందే. అయితే ఇప్పటి వరకు ఆన్ సే యంగ్, సింధు మధ్య 10 మ్యాచ్‌లు జరిగాయి. అన్నింటిలోనూ సింధు ఓడింది. ఇప్పటి వరకు ఆన్‌పై సింధు విక్టరీ నమోదు చేయకపోవడం గమనార్హం. గురువారం జరిగిన రౌండ్-16 మ్యాచ్‌లో తొలి గేమ్ ఆసక్తికరంగా సాగింది. ఓ దశలో ఇద్దరూ 10-10 స్కోరుతో సమంగా నిలిచారు. కొరియన్ ప్లేయర్‌ను కాసేపు వత్తిడిలో పెట్టింది సింధు. ఆ తర్వాత 15-14 లీడ్ సాధించింది. కానీ ఆన్ దూకుడు ఆటతో సింధు వెనుకబడింది. తొలి గేమ్ చివరలో 41 షాట్ల ర్యాలీ ఆడారు. ఆ తర్వాత ఓపెనింగ్ గేమ్‌ను కొరియన్ క్రీడాకారిణి సొంతం చేసుకున్నది. రెండో గేమ్‌లోనూ ఆన్ ఈజీగా విజయాన్ని నమోదు చేసింది.

# నేనేం పారిపోవట్లే

ఐపీఎల్ మాజీ చైర్మెన్ లలిత్ మోదీ తాజాగా ఓ మీడియా సంస్థకు ఇంటర్వ్యూ ఇచ్చారు. ఎవరి నుంచీ తానేమీ పారిపోవడం లేదన్నారు. ఎటువంటి నేరం తనపై రుజువు కాలేదన్నారు. భారతీయ అధికారుల నుంచి విజయవంతంగా దాక్కుంటున్నట్లు వస్తున్న వార్తలను ఆయన ఖండించారు. అది కేవలం మీడియా తన సెన్షేషన్ కోసం చేస్తున్న ప్రచారం మాత్రమే అన్నారు. న్యాయపరంగా తాను అందరికీ అందుబాటులో ఉన్నట్లు చెప్పారు. ఎక్కడికీ పారిపోవడం లేదన లలిత్ మోదీ.. గ్లోబల్ సూపర్‌పవర్ ఇండియా నుంచి తప్పించుకోవడం అసాధ్యమైన అంశమన్నారు. ఒకవేళ నిజంగా నేను పారిపోతుంటే, అప్పుడు భారత్ నన్ను పట్టుకోవడం కష్టమైన పనేకాదని, భారతీయ ప్రభుత్వానికి చాలా సత్తా ఉందని, భారత ప్రభుత్వంతో పెట్టుకోలేమని, నాకు ఆ ఉద్దేశం కూడా లేదని, ప్రభుత్వం కాదు, కానీ మీడియానే అతి చేస్తున్నట్లు ఆయన ఆరోపించారు. మీడియా అంశంలో కఠినమైన పరువునష్టం చట్టాలు లేకపోవడం సమస్యగా మారిందన్నారు. ఇండియాలో మీడియాపై కేసులు లేవని, దాని వల్లే ఇష్టం వచ్చినట్లు వార్తలు ఇస్తున్నారని ఆరోపించారు. మనీల్యాండరింగ్, ఫెమా చట్టాల ఉల్లంఘన కేసులను మోడీ ఎదుర్కొంటున్నారు. కానీ తనపై ఇప్పటి వరకు ఎటువంటి నేరపూరిత ఆరోపణలు రుజువు కాలేదన్నారు. భారతీయ న్యాయ వ్యవస్థను లలిత్ మోడీ తప్పుపట్టారు. భారత్‌లో న్యాయం ఆలస్యంగా దక్కుతుందని, నెమ్మదిగా న్యాయం అందడం అంటే, అదో పెద్ద శిక్ష అన్నారు. అప్పటి వరకు తనపై ఒక్క కేసు కూడా నమోదు కాలేదన్నారు. ఒకవేళ నిజంగా తాను చెడ్డవాడినే అయితే, అప్పుడు మీరు న్యాయం ప్రకారం ప్రాసిక్యూట్ చేయవచ్చు అన్నారు. ఇక ఇప్పుడు ఇండియాకు తిరిగి రావాలన్న ఆలోచన లేదన్నారు. మీరు నన్ను అరెస్టు చేయాలనుకుంటున్నారా.. 17 ఏళ్ల నుంచి మీరు నన్ను కోర్టుకు తీసుకెళ్లలేదు, మీరెలా నన్ను అరెస్టు చేయగలదరు, ఒకవేళ ఏదైనా ఉంటే, అదే జరుగుతుందని లలిత్ మోడీ అన్నారు.



# కావ్యా మారన్ ఆడకుండా చేసింది: లివింగ్ స్టన్

ఇంగ్లండ్ స్టార్ లియామ్ లివింగ్‌స్టోన్ సన్‌రైజర్స్ యాజమాన్యాన్ని (కావ్యా మారన్) ఉద్దేశించి సంచలన ఆరోపణలు చేశాడు. తనకు తుదిజట్టులో చోటు దక్కకపోవడానికి కావ్యా మారన్ కారణమని పరోక్షంగా లివింగ్‌స్టోన్ వ్యాఖ్యానించాడు. స్టిక్ టు క్రికెట్ పాడ్‌కాస్ట్‌తో మాట్లాడుతూ.. "ముంబై ఇండియన్స్‌కి అత్యవసరమైన ఓ ఆటగాడిని మా జట్టు కొనుగోలు చేసింది. వేలం సమయంలో మా యాజమాన్యం పర్సులో బోలెడు డబ్బు ఉంది. కాబట్టి అతడిని సొంతం చేసుకోగలిగింది. మా యజమానులకు అతడంటే చాలా చాలా ఇష్టం. అతడిని అమితంగా ప్రేమిస్తారు. అందుకే జట్టులోకి తీసుకున్నారు. మా కోచ్ డాన్ (డానియల్ వెటోరి) స్వయంగా నాతో ఈ మాట చెప్పాడు. అప్పుడే నాకో విషయం అర్థమైంది. ఎవరో ఒకరు గాయపడితే తప్ప నాకు తుదిజట్టులో చోటు దక్కదని తెలిసింది" అని లివింగ్‌స్టోన్ పేర్కొన్నాడు. ఇందుకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఈ నేపథ్యంలో లివింగ్‌స్టోన్ ప్రస్తావించిన ఆటగాడు ఎవరా? అని నెట్టింట చర్చ నడుస్తోంది. ఈ క్రమంలో చాలా మంది సలీల్ అరోరా పేరును తెరమీదకు తెస్తున్నారు. అతడు సలీల్ అరోరా అని సమాచారం. పంజాబ్‌కు చెందిన 23 ఏళ్ల సలీల్ అరోరా వికెట్ కీపర్ బ్యాటర్. ఐపీఎల్-2026 మినీ వేలంలో సన్‌రైజర్స్- ముంబై ఇండియన్స్ అతడి కోసం పోటీ పడ్డాయి. ఈ క్రమంలో ఆఖరికి రూ. 1.5 కోట్లకు సన్‌రైజర్స్ సలీల్‌ను సొంతం చేసుకుంది. సీజన్ ఆరంభ మ్యాచ్‌లో భాగంగా ఆర్సీబీతో పోరు సందర్భంగా సలీల్ అరోరా సన్‌రైజర్స్ తరఫున అరంగేట్రం చేశాడు. ఆరో స్థానంలో బరిలోకి దిగి 9 పరుగులకే నిష్క్రమించాడు. సీజన్‌లో మొత్తంగా పదకొండు ఇన్నింగ్స్ ఆడి 156 పరుగులు చేశాడు.



# చరిత్ర సృష్టించిన లార్డ్స్ మైదానం

క్రికెట్‌కు మక్కాగా పేరొందిన ఇంగ్లండ్‌లోని లార్డ్స్ క్రికెట్ మైదానం మరో అరుదైన ఘనత సాధించింది. 1884లో తొలి టెస్టు మ్యాచ్‌కు వేదికైన ఈ చారిత్రక మైదానం.. ఇవాళ ఇంగ్లండ్-న్యూజిలాండ్ మధ్య ప్రారంభమైన టెస్టుతో 150 టెస్టు మ్యాచ్‌లు పూర్తి చేసుకుంది. తద్వారా ప్రపంచంలో ఈ ఘనత సాధించిన తొలి క్రికెట్ మైదానంగా చరిత్ర సృష్టించింది. లార్డ్స్ తర్వాత అత్యధిక టెస్ట్ మ్యాచ్‌లకు ఆతిథ్యమిచ్చిన మైదానంగా ఆస్ట్రేలియాలోని మెల్‌బోర్న్ క్రికెట్ గ్రౌండ్ ఉంది. ఈ మైదానంలో ఇప్పటివరకు 118 టెస్ట్ మ్యాచ్‌లు జరిగాయి. ఆతర్వాతి స్థానంలో ఆస్ట్రేలియాకే చెందిన సిడ్నీ క్రికెట్ గ్రౌండ్ ఉంది. ఈ మైదానం ఇప్పటివరకు 114 టెస్ట్ మ్యాచ్‌లకు ఆతిథ్యమిచ్చింది. ఆతర్వాతి స్థానంలో ఇంగ్లండ్‌లోని ద ఓవల్ గ్రౌండ్ ఉంది. ఈ మైదానంలో ఇప్పటివరకు 108 టెస్ట్ మ్యాచ్‌లు జరిగాయి. కాగా, లార్డ్స్‌లో ఇప్పటివరకు జరిగిన 150 టెస్ట్‌ల్లో ఆతిథ్య ఇంగ్లండ్ జట్టు ఏకంగా 146 మ్యాచ్‌లు ఆడింది. ఇందులో 60 విజయాలు, 35 పరాజయాలు, 51 డ్రాలు నమోదు చేసింది. ముఖ్యంగా యాషెస్ సిరీస్‌లో ఎన్నో క్లాసిక్ మ్యాచ్‌లు ఈ మైదానంలో జరిగాయి. దాదాపు 2.5 మీటర్ల వంపు కలిగిన ప్రత్యేకత లార్డ్స్‌కు మాత్రమే ఉంది. మ్యాచ్ ప్రారంభ రోజున పేసర్లకు అనుకూలించే ఈ పిచ్ క్రమంగా ఎండిపోతూ స్పిన్నర్లు, బ్యాటర్లకు కూడా సహకరిస్తుంది.

ఈవార్తలు
# ప్రజావాణి
www.evarthalu.com
నేటి ఈవార్తలు 12
శుక్రవారం 5-6-2026, జగిత్యాల

నేటి ఈవార్తలు సంపాదకీయం Editorial

# గొయ్యి తవ్వుకుంటున్న బీజేపీ!

తెలంగాణలో భారతీయ జనతా పార్టీ ఒకప్పుడు ప్రత్యామ్నాయ రాజకీయ శక్తిగా ఎదుగుతుందనే అంచనాలు బలంగా వినిపించాయి. ముఖ్యంగా 2019 తర్వాత, అలాగే 2023 అసెంబ్లీ ఎన్నికల ముందు వరకు రాష్ట్రంలో బీజేపీ వేగంగా విస్తరిస్తోందనే భావన కనిపించింది. అయితే ప్రస్తుతం ఆ పార్టీ వ్యవహరిస్తున్న తీరు చూస్తుంటే, తనకు తానే రాజకీయంగా గోతిని తవ్వుకుంటోందనే అభిప్రాయం తెలంగాణ సమాజంలో వ్యక్తమవుతోంది. తెలంగాణ ఏర్పాటుకు దారితీసిన ఉద్యమం కేవలం రాజకీయ ప్రక్రియ మాత్రమే కాదు. అది స్వాభిమానానికి, ప్రాంతీయ ఆత్మగౌరవానికి ప్రతీక. ఈ నేపథ్యంలో తెలంగాణ ప్రజలు తమ ప్రత్యేకతను, తమ భావోద్వేగాలను గౌరవించే రాజకీయ శక్తులకే ప్రాధాన్యం ఇస్తుంటారు. కానీ ఇటీవల కొన్ని సందర్భాల్లో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన నాయకులు తెలంగాణ ఆవిర్భావం, తెలంగాణ సమాజం లేదా రాష్ట్ర నాయకత్వంపై చేసిన వ్యాఖ్యలకు బీజేపీ నాయకులు ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా మద్దతు పలకడం తీవ్ర చర్చకు దారితీసింది. తెలంగాణలో పార్టీని బలోపేతం చేయాల్సిన నాయకులు రాష్ట్ర ప్రజల మనోభావాలను పక్కనబెట్టి ఇతర రాష్ట్రాల రాజకీయ అజెండాలకు ప్రాధాన్యం ఇస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా తెలంగాణ అంశం వచ్చినప్పుడు స్పష్టమైన వైఖరి తీసుకోకుండా, ఆంధ్రా నాయకుల వ్యాఖ్యలను సమర్థించే ప్రయత్నం చేయడం క్షేత్రస్థాయి కార్యకర్తలను ఇబ్బందికర పరిస్థితిలోకి నెడుతోంది. ప్రజల్లో తిరిగే కార్యకర్తలకు ఈ ప్రశ్నలకు సమాధానాలు చెప్పడం కష్టంగా మారుతోంది. తెలంగాణలో బీజేపీ బలం పెరగడానికి ప్రధాన కారణం స్థానిక నాయకత్వం, స్థానిక సమస్యలపై పోరాటమే. కానీ ఇప్పుడు ఆ స్థానికత క్రమంగా బలహీనపడుతోందనే భావన పార్టీ శ్రేణుల్లో కనిపిస్తోంది. ఢిల్లీ నాయకత్వం రాష్ట్ర పరిస్థితులను పూర్తిగా అర్థం చేసుకోకుండా నిర్ణయాలు తీసుకుంటోందని, తెలంగాణ భావజాలానికి విరుద్ధంగా ఉన్న అంశాలపై స్పందించడంలో విఫలమవుతోందని కార్యకర్తలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. రాజకీయాల్లో ప్రజల భావోద్వేగాలను నిర్లక్ష్యం చేసిన పార్టీలు ఎప్పటికీ మూల్యం చెల్లించక తప్పదు. తెలంగాణ విషయంలో కూడా అదే వర్తిస్తుంది. రాష్ట్ర ఆత్మగౌరవాన్ని తక్కువ చేసి మాట్లాడే వారితో రాజకీయ సాన్నిహిత్యం పెంచుకుంటే, దాని ప్రభావం తప్పకుండా ఓటు బ్యాంకుపై పడుతుంది. తెలంగాణలో ఎదగాలంటే తెలంగాణ ప్రజల పక్షాన నిలబడాలి గానీ, వారి మనోభావాలను దెబ్బతీసే శక్తులకు వత్తాసు పలకకూడదు. ప్రస్తుతం బీజేపీ ముందు ఉన్న అతిపెద్ద సవాలు ప్రతిపక్షాలతో పోరాడటం కాదు; తనపై పెరుగుతున్న ప్రజా అనుమానాలను తొలగించుకోవడం. కార్యకర్తల అసంతృప్తిని, ప్రజల్లో వ్యక్తమవుతున్న వ్యతిరేక భావనను అధిష్ఠానం ఇప్పటికైనా గుర్తించకపోతే, పార్టీ నిర్మించుకున్న రాజకీయ పునాదులు క్రమంగా బలహీనపడే ప్రమాదం ఉంది. తెలంగాణలో బీజేపీకి అవకాశాలు ఇంకా పూర్తిగా ముగిసిపోలేదు. కానీ ఆ అవకాశాలను నిలబెట్టుకోవాలంటే తెలంగాణ స్వాభిమానాన్ని గౌరవించే స్పష్టమైన రాజకీయ వైఖరి అవసరం. లేకపోతే ప్రత్యామ్నాయ శక్తిగా ఎదగాల్సిన పార్టీ, తన చేతులతోనే తన రాజకీయ భవిష్యత్తును దెబ్బతీసుకుంటోందనే విమర్శలకు సమాధానం చెప్పాల్సి వస్తుంది.



# నాయకులు హద్దుల్లో ఉండాలి

తెలంగాణ అంశం సాధారణ రాజకీయ చర్చ కాదు. అది ఒక ప్రాంత ప్రజల ఆత్మగౌరవం, దశాబ్దాల పోరాటం, వేలాది మంది త్యాగాలతో ముడిపడి ఉన్న చారిత్రక భావోద్వేగం. అలాంటి అంశంపై మాట్లాడేటప్పుడు రాజకీయ నాయకులు మరింత సంయమనంతో వ్యవహరించాల్సిన అవసరం ఉంటుంది. ఇటీవల జనసేన అధినేత, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చేసిన వ్యాఖ్యలు తెలంగాణలో తీవ్ర చర్చకు దారితీశాయి. ఆయన వ్యాఖ్యలపై గద్దర్ కుమార్తె వెన్నెలతో పాటు పలువురు తెలంగాణ వాదులు అభ్యంతరం వ్యక్తం చేయడం దీనికి నిదర్శనం.

పవన్ కల్యాణ్‌కు తెలంగాణలో ఒకప్పుడు మంచి ఆదరణ ఉండేది. ముఖ్యంగా యువతలో, సినిమా అభిమానుల్లో ఆయనకు ప్రత్యేక ఫ్యాన్ బేస్ ఏర్పడింది. రాజకీయంగా కూడా తెలంగాణలో జనసేనకు ప్రత్యక్ష బలం లేకపోయినా, వ్యక్తిగతంగా పవన్‌కు సానుభూతి చూపే వర్గాలు ఉన్నాయి. కానీ తరచూ ఆయన చేసే ఆవేశపూరిత వ్యాఖ్యలు ఆ మద్దతును దెబ్బతీస్తున్నాయనే అభిప్రాయం పెరుగుతోంది. పవన్ కల్యాణ్ రాజకీయ జీవితంలో ఒక ప్రధాన బలహీనత ఏమిటంటే, చిన్న ప్రేరేపణకే భావోద్వేగానికి లోనై స్పందించడం. ఒక బాధ్యతాయుత నాయకుడిగా ఆలోచించి మాట్లాడాల్సిన సందర్భాల్లో కూడా ఆవేశానికి లోనవుతూ వివాదాలకు కేంద్రబిందువుగా మారుతున్నారు. రాజకీయాల్లో పదవులు పెరిగిన కొద్దీ మాటల బాధ్యత కూడా పెరుగుతుంది. ముఖ్యంగా ఉప ముఖ్యమంత్రిగా ఉన్న వ్యక్తి వ్యాఖ్యలు రెండు రాష్ట్రాల మధ్య సంబంధాలపై కూడా ప్రభావం చూపే అవకాశం ఉంటుంది. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం జరిగిన ఉద్యమం గురించి ఎవరి రాజకీయ అభిప్రాయం ఎలా ఉన్నా, అది ఒక చారిత్రక వాస్తవం. ఆ ఉద్యమం ద్వారా కోట్లాది మంది ప్రజల ఆకాంక్షలు నెరవేరాయి. అందువల్ల ఆ అంశాన్ని తేలికగా తీసుకోవడం లేదా వ్యంగ్యంగా మాట్లాడటం సహజంగానే తెలంగాణ ప్రజల్లో ప్రతికూల స్పందనకు దారితీస్తుంది. తెలంగాణ ప్రజలు తమ రాష్ట్ర గౌరవాన్ని ప్రశ్నించేలా కనిపించే ఏ వ్యాఖ్యనైనా సులభంగా మరిచిపోరు.

రాజకీయ నాయకుడు తన అభిమానులను పెంచుకోవడం కష్టం. కానీ వారిని దూరం చేసుకోవడం చాలా సులభం. పవన్ కల్యాణ్ ప్రస్తుతం అదే ప్రమాదకర మార్గంలో నడుస్తున్నట్లు కనిపిస్తోంది. తెలంగాణలో ఆయనకు ఉన్న అభిమాన వర్గం రాజకీయ ప్రత్యర్థుల వల్ల కాదు, ఆయన స్వయానా వ్యాఖ్యల వల్లే దూరమవుతున్న పరిస్థితి కనిపిస్తోంది. ఒకప్పుడు రెండు తెలుగు రాష్ట్రాల్లో సమానంగా ఆదరణ పొందిన నాయకుడిగా కనిపించిన పవన్, ఇప్పుడు ప్రాంతీయ భావోద్వేగాలను అర్థం చేసుకోలేని నాయకుడిగా ముద్రపడే ప్రమాదం ఎదుర్కొంటున్నారు. నాయకత్వం అంటే కేవలం ఆవేశంతో మాట్లాడటం కాదు. ఎప్పుడు మాట్లాడాలి, ఏమి మాట్లాడాలి, ఎంతవరకు మాట్లాడాలి అనే వివేకం కూడా అవసరం. రాజకీయాల్లో హాస్యాస్పదంగా మారడం క్షణాల్లో జరుగుతుంది. కానీ కోల్పోయిన విశ్వసనీయతను తిరిగి సంపాదించడం చాలా కష్టం. తెలంగాణ అంశంలో పవన్ కల్యాణ్ చుట్టూ ఏర్పడిన వివాదం కూడా అదే విషయాన్ని గుర్తు చేస్తోంది. ప్రజా జీవితంలో ఉన్న నాయకులు తమ మాటల ప్రభావాన్ని అర్థం చేసుకోవాలి. ముఖ్యంగా ప్రాంతీయ ఆత్మగౌరవం, చారిత్రక ఉద్యమాల వంటి సున్నితమైన అంశాలపై మాట్లాడేటప్పుడు మరింత జాగ్రత్త అవసరం. లేకపోతే రాజకీయ లాభం కోసం చేసిన వ్యాఖ్యలు చివరకు స్వీయ నష్టానికి దారితీసే అవకాశమే ఎక్కువ. తెలంగాణ విషయంలో పవన్ కల్యాణ్ ఎదుర్కొంటున్న ప్రతిస్పందన కూడా అదే హెచ్చరికను ఇస్తోంది.



శశిధర్ అక్కల
జగిత్యాల జిల్లా




జీవకోటి మనుగడకు శ్వాసనిచ్చే గాలిని, దాహం తీర్చే నీటిని ప్రసాదించిన ప్రకృతి అంతులేని ఒక అద్భుత వరం. కానీ, మానవుడు తన మితిమీరిన స్వార్థంతో, ఆధునీకరణ, పారిశ్రామికీకరణ పేరిట నేడు ఆ ప్రకృతి తల్లి గుండెపై గొడ్డలిపెట్టు పెడుతున్నాడు. ఒకవైపు పచ్చని అడవులను నరికివేస్తూ, మరోవైపు ప్లాస్టిక్ మహమ్మారితో నేలను విషపూరితం చేస్తూ, కాలుష్య పొగలతో గాలిని ఊపిరాడకుండా చేస్తున్నాడు. దీని ఫలితంగానే నేడు వాతావరణ సమతుల్యత దెబ్బతిని రుతుపవనాలు గతి తప్పుతున్నాయి, అకాల వర్షాలు ముంచెత్తుతున్నాయి, మునుపెన్నడూ లేని విధంగా ముఖం పగిలేలా ఎండలు మండుతూ భూగోళం గ్లోబల్ వార్మింగ్ (భూతాపం) కోరల్లో చిక్కుకుంటోంది.

ఆధునిక సమాజానికి పట్టిన అత్యంత ప్రమాదకరమైన జబ్బు "ప్లాస్టిక్ మహమ్మారి". ఒక్కసారి వాడి పారేసే ప్లాస్టిక్ గ్లాసులు, కవర్లు, ప్లేట్లు నేడు భూమి పొరల్లోకి చేరి నేల తల్లిని ఊపిరి ఆడకుండా చేస్తున్నాయి. వందల ఏళ్లైనా విచ్ఛిన్నం కాని ఈ ప్లాస్టిక్ వ్యర్థాలు పశువుల పొట్టల్లోకి చేరి వాటి ప్రాణాలను బలితీసుకుంటున్నాయి. దీని నిర్మూలనకు ప్రతి ఒక్కరూ తమ జీవనశైలిని మార్చుకోవాలి. బజారుకు వెళ్లేటప్పుడు విధిగా క్లాత్ సంచి లేదా జనపనార సంచిని వెంట తీసుకెళ్లడం అలవాటు చేసుకోవాలి. శుభకార్యాల్లో ప్లాస్టిక్ వస్తువుల స్థానంలో స్టీలు పాత్రలు, మట్టి గ్లాసులు లేదా విస్తరాకులను వాడటం ద్వారా ప్లాస్టిక్ రహిత సమాజ స్థాపనకు ప్రతి ఒక్కరూ పునాది వేయాలి. కాలుష్య భూతాన్ని తరిమికొట్టేందుకు ప్రకృతి మనకు ఇచ్చిన ఏకైక సంజీవని "పచ్చదనం". అడవుల నరికివేత వల్ల వాతావరణంలో కార్బన్ డై ఆక్సైడ్ శాతం పెరిగిపోయి ఓజోన్ పొరకు రంధ్రాలు పడుతున్నాయి. దీన్ని నివారించాలంటే కేవలం మొక్కలు నాటి చేతులు దులుపుకుంటే సరిపోదు, నాటిన ప్రతి మొక్కనూ ఒక బిడ్డలా బాధ్యతగా సంరక్షించాలి. ప్రతి ఒక్కరూ తమ పుట్టినరోజులు, పండుగలు లేదా పెద్దల జ్ఞాపకార్థ దినాల్లో కనీసం ఒక మొక్కనైనా నాటి పెంచాలి. స్థలం లేని వారు మిద్దె తోటలు (టెర్రస్ గార్డెనింగ్) లేదా ఇండోర్ ప్లాంట్స్ ద్వారా తమ ఇళ్లను పచ్చదనంతో నింపుకోవాలి. చెట్లను కాపాడుకోవడం అంటే మానవాళి ఆయుష్షును పెంచుకోవడమే. రసాయన ఎరువుల మితిమీరిన వాడకం, పారిశ్రామిక వ్యర్థాలను ఇష్టానుసారంగా పారేయడం వల్ల నేల తల్లి తన సహజత్వాన్ని కోల్పోయి భూకాలుష్యం కోరల్లో చిక్కుకుంటోంది. భూసారం దెబ్బతినడం వల్ల మనం తినే ఆహారం కూడా విషపూరితంగా మారుతోంది. ముఖ్యంగా వ్యవసాయ రంగంలో పంట వ్యర్థాలను, వరి కొయ్యలను పొలాల్లోనే తగులబెట్టడం వల్ల భూమిలోని మైక్రో బ్యాక్టీరియా, మిత్రపురుగులు చనిపోతున్నాయి. రైతులు రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించి సేంద్రియ, బయో ఎరువుల వైపు మొగ్గు చూపాలి. వాహనాల నుండి వచ్చే పొగ, పరిశ్రమల కాలుష్యం కారణంగా నేడు గాలి విషతుల్యంగా మారి శ్వాసకోస వ్యాధులు పెరిగిపోతున్నాయి. పర్యావరణ సమతుల్యతను కాపాడటానికి మన వంతుగా సైకిల్‌పై వెళ్లడం లేదా నడవడం అలవాటు చేసుకోవాలి. ఇది ఇంధనాన్ని ఆదా చేయడమే కాకుండా ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది. సాధ్యమైనంత వరకు ప్రజా రవాణా వ్యవస్థను (ఆర్టీసీ బస్సులు, రైళ్లు) ఉపయోగించాలి. అలాగే, కాలుష్య నివారణకు పర్యావరణ హితమైన ఎలక్ట్రిక్ వాహనాల వాడకాన్ని మరింత ప్రోత్సహించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. పర్యావరణ పరిరక్షణ అనేది కేవలం ప్రభుత్వాలదో, అధికారులదో లేక స్వచ్ఛంద సంస్థలదో బాధ్యత కాదు. అది ఈ భూమిపై పుట్టిన ప్రతి మనిషి జీవన్మరణ సమస్య. మనం ప్రకృతిని కాపాడితేనే, ఆ ప్రకృతి మనల్ని కాపాడుతుంది. రాబోయే తరాలకు కాలుష్య రహిత, స్వచ్ఛమైన వాతావరణాన్ని కానుకగా ఇవ్వడం మన కనీస కర్తవ్యం. "పర్యావరణాన్ని రక్షిద్దాం – ప్రగతిని సాధిద్దాం" అనే నినాదంతో ఈ పర్యావరణ దినోత్సవం రోజున ప్రతి ఒక్కరం కంకణబద్ధులై ప్రకృతి రక్షణలో భాగస్వాములవుదాం.




ముత్యాల సురేశ్
సీనియర్ జర్నలిస్ట్, 9912715325

## రచయితలకు ఆహ్వానం!

సమాజాన్ని మేల్కొల్పుదామా..
యువతకు మార్గం చూపుదామా..
విద్యార్థులకు మార్గదర్శనం చేద్దామా..
న్యాయ, వైద్య సలహాలు చెబుదామా..
వ్యాపార మెలకువలు నేర్పుదామా..
మీ జ్ఞానాన్ని పంచే ఆలోచనతో ఉన్నారా..

అయితే, మీ రచనలకు పదును పెట్టండి..
మీ అభిప్రాయాలను రాతగా మార్చండి..
'ప్రజావాణి' వేదికగా ప్రజలకు దగ్గరవ్వండి..
నేటి 'ఈవార్తలు' పత్రికతో మమేకమవ్వండి..
కథలు, కవితలు, వ్యాసాలు ఏవైనా..
మీ సొంత సమాచారం.. మీ బైలైన్‌తో..!



పంపాల్సిన చిరునామా:
మెయిల్: contact@evarthalu.com
వాట్సాప్ నంబర్: 9440455811

This newspaper is Owned and Published by **BOMMAKANTI SHRAVAN KUMAR** from H.No.4-36, Balwanthapoor, Mallial, Jagitial District, Telangana, 505452, Phone Number: 9440455811. Edited by **BOMMAKANTI SHRAVAN KUMAR** and Printed by M/s Kakatiya Printers at #2-24-96/9, Near Sri Krishna Pharma, Laxminarayana Nagar, Ida Uppal, Medchal Malkajgiri District, Telangana, 500039. PRGI REGD No.: TGTEL/25/A1385 . Corporate Office: #1-5-431/20/4, GS Pride, Plot No.4, Jonnabanda, Old Alwal, Medchal Malkajgiri District, Telangana, 500010. Landline: 040-35673004.